# కరీంనగర్ వార్త



గురువారం 11, ఆగష్టు 2022 | 16 పేజీలు


## భావితరాలకు చాటిచెప్పేలా భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాలు

రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



2లో...

## అంతా కల్తీమయం

- త్రాగే నీటి నుంచి తినే ఆహారం వరకు కల్తీ
- నాణ్యత పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు
- పత్తాలేని సంబంధిత అధికారులు
- ఏళ్ల తరబడి ఇంచార్జిలే దిక్కు

2లో..



**కరీంనగర్ ప్రతినిధి, ప్రభాతవార్త:** మార్కెట్‌లో ఆహార పదార్థాలు మొదలుకొని వంట సరుకుల వరకు ఎక్కడ చూసినా అంతా కల్తీమయం. పాలు, నీళ్లు, కారం, నెయ్యి, వంటనూనెలు, మసాలా, దినుసులు, అల్లం, వెల్లుల్లి పేస్టు, బిర్యానీ సెంటర్, హోటళ్లు, రెస్టారెంట్లు, ఐస్‌క్రీం పార్లర్, కిరాణం దుకాణం కాదేదీ కల్తీకి అనర్హం.. అన్నట్లు సాగుతోంది. కల్తీల చీకటి వ్యవహారం.. ఇక పండ్లు, కూరగాయలు ఎక్కువ కాలం నిల్వ చేసేందుకు రంగు వచ్చి ఆకర్షణీయంగా కనిపించేందుకు వివిధ రకాల రసాయనాలు మార్కెట్లలో వినియోగిస్తున్నారు. అడుగడుగునా నకిలీలు పాగా వేసిన పరిస్థితుల్లో నియంత్రించే సంబంధిత ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలకు శాపంగా మారింది. కల్తీ ఆహార పదార్థాలను గుర్తించలేక నిత్యం ఎంతోమంది అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఆస్పత్రుల పాలై జేబులు గుల్ల చేసుకుని ఇబ్బందులు పాలవుతున్నారు.

- ఏడాదికేడాదీ కుంగిపోతున్న రైతాంగం
- తెగుళ్లు ఓ వైపు ప్రకృతి ప్రకోపం మరోవైపు
- గత మూడేళ్లుగా కన్నీళ్లు పెడుతున్న రైతన్నలు



## కర్షకుల కష్టం వర్షార్పణం

2లో..

**కరీంనగర్ బ్యూరో, ప్రభాతవార్త :** గత మూడేళ్లుగా రైతుల్లో కన్నీళ్లు కళ్లలోనే కరిగిపోతున్నాయి. కర్షకులు ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటకు ఫలితం రాకుండానే కన్నీళ్లు చవిచూస్తున్నారు. కర్షకుల కష్టం వర్షార్పణం అవుతుండగా, మరోవైపు దళారులచేతిలో దగాకు గురికావాల్సి వస్తుంది. ప్రకృతి విలయతాండవానికి ఆదిలోనే నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఖరీఫ్ కాలం ఆరంభం నుంచే అన్నదాతకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. రైతుకు దెబ్బమీ దెబ్బ పడుతూనే ఉంది. ప్రకృతి సహకరించక ఒకవైపు... పండిన పంటకు గిట్టుబాటు ధర లేక మరోవైపు రైతన్న తీవ్ర మనోవేదనకు గురౌతున్నాడు.

## ప్రతి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీలో ఫ్రీడం పార్కు ఏర్పాటు కోసం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు.



2వపేజీలో...

## ఏరియా ఆసుపత్రిలో మొక్కలు నాటిన కలెక్టర్ అనురాగ్ జయంతి



2వపేజీలో...

**వేములవాడ, ప్రభాతవార్త :** భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవితో కలిసి మొక్కలు నాటారు. పట్టణంలోని జంక్షన్లలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు.




# భావితరాలకు చాటిచెప్పేలా భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలు

మొదటి పేజీ తరువాయి

**- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్**

**కరీంనగర్ బ్యూరో, ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర్యం కోసం అహర్నిషలు పోరాడిన వారిని స్మరించుకుంటూ పోరాట నిరతని, త్యాగాలను భావితరాలకు చాటిచెప్పేలా వజ్రోత్సవాలను నిర్వహించుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా మంత్రి బుధవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని 7వ డివిజన్‌లో 26.40 లక్షలతో ఏర్పాటు చేసిన ఫ్రీడం పార్క్‌ను ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫ్రీడం పార్క్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. తదుపరి జిల్లా కేంద్రంలోని ప్రతిమా మల్టీప్లెక్స్‌లో విధ్యార్థుల కోసం ప్రదర్శిస్తున్న గాంధీ చిత్రాన్ని చూశారు. ఈ సంధర్బంగా విలేకర్లతో మాట్లాడుతూ భావితరాలకు సంపదను సృష్టించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన మేరకు మొక్కలను నాటడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేలా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను ఆగస్టు 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందని, అందుకు ప్రతి ఇంటికి జాతీయ జెండాలను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ 540 చిన్న చిన్న రాజ్యాలుగా ఉన్న భారతదేశాన్ని మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి ఎందరో మహనీయులు ఒకటిగా చేశారన్నారు. నేటి తరానికి చరిత్రను గురించిన విషయాలు తెలియజేయాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వజ్రోత్సవాలను నిర్వహణకు నిర్ణయించారని తెలిపారు. దేశంలో ఎన్నో గొప్ప ప్రాజెక్టులు, కర్మాగారాలు, రహదారులను నిర్మించుకోవడం జరిగిందన్నారు. మహాత్ములను, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలను రూపొందించిన వారిని కొందరు కించపరిచే వాఖ్యలను చేయడం బాధాకరమన్నారు. రాబోయే 25 సంవత్సరాలు 2047 వరకు భారతదేశం గొప్పగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వై.సునీల్‌రావు, సిపి సత్యనారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, ప్రజాప్రతినిధులు, అధికారులున్నారు.



## ఏరియా ఆసుపత్రిలో మొక్కలు నాటిన కలెక్టర్ అనురాగ్ జయంతి

మొదటి పేజీ తరువాయి



దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన గాంధీ గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు గాంధీ చిత్రప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వజ్రోత్సవాల్లో భాగంగా జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో 257 ప్రాంతాలను గుర్తించి ఫ్రీడమ్ పార్కులను ఏర్పాటు చేసి మొక్కలు నాటుతామని తెలిపారు. ప్రతి ఇంటిపైన జెండా ఎగురవేసి జాతీయ సమైక్యత స్పూర్తిని చాటాలని కోరారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్‌రావు, కౌన్సిలర్లు, డిపో మేనేజర్ భీంరెడ్డి ఉన్నారు.

# పేదింటి ఆడపడుచుల వివాహానికి అండగా కళ్యాణలక్ష్మి

**- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల**

**ధర్మపురి, ప్రభాతవార్త :** పేదింటి ఆడపడుచుల వివాహానికి తమ తల్లిదండ్రులు ఎంతో కష్టపడాల్సి ఉంటుందని అలాంటి సమస్యల్ని ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించి వారికి అండగా నిలిచేందుకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ధర్మపురి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన లబ్ధిదారులైన 704 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధికి చెందిన రూ.2.43 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ధర్మపురి, గొల్లపల్లి మండలాలకు చెందిన 103 మంది లబ్ధిదారులకు 1.03 కోట్ల విలువైన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు ఏదైనా అనారోగ్యానికి గురైతే వైద్యం చేయించుకోవడానికి అప్పులు చేయాల్సి ఉంటుందని అలాంటి బాధితులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో పేదవారు తమ కూతుళ్లకు వివాహం చేయాలంటే అప్పులపాలయ్యేవారని ప్రస్తుతం తెలంగాణ రా ష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్షి, షాదిముబారక్ పథకంతో వారి కుటుంబాలకు పెద్ద కొడుకుగా అండగా నిలుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు వివిధ పథకాలతో లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ధర్మపురి ఎంపీపీ చిట్టిబాబు, ధర్మపురి, బుగ్గారం జడ్పీటిసి సభ్యులు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసి చైర్మన్ అయ్యోరి రాజేష్, వైస్ చైర్మన్ అక్కనపెల్లి సునీల్, తహసీల్దార్ వెంకటేష్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమం

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ**

మొదటి పేజీ తరువాయి



స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం అంతర్గాం మండలంలోని కుందనపల్లి అర్బన్ పార్కులో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి, భారత దేశ ఆకారంలో ఏర్పాటు చేసిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్రం పూర్తయిన నేపథ్యంలో వజ్రోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమం కింద ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటీ ఫ్రీడమ్ పార్కు కింద 75, 750 మొక్కలు నాటడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ, డిసిపి రూపేష్, జిల్లా అటవీ అధికారులు శివయ్య, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, అంతర్గాం జడ్పిటిసి నారాయణ, వైస్ ఎంపిపి లక్ష్మి, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ యాదగిరి, సంబంధిత అధికారులున్నారు.

# అంతా కల్తీమయం

మొదటి పేజీ తరువాయి

మారుతున్న కాలంతో పాటు ప్రజలు అంతే వేగంగా మార్పు చెంది ఈజీ ఫుడ్‌కు అలవాటుపడుతున్నారు. ఎక్కడ తింటున్నాం..ఎక్కడ కొంటున్నాం.. నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా.. లేదా ఇవేమీ చూడకుండానే రోగాల బారిన పడుతున్నారు. ఇక ఏళ్ల తరబడి సంబంధిత ఆహార పరిరక్షణ ప్రమాణాల విభాగం (ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ డిపార్ట్‌మెంట్) జిల్లాలో పత్తానే లేదు. ఏళ్ల తరబడి కరీంనగర్ జిల్లాలో నియామకాలు లేవు.. ఉద్యోగులూ లేరు.. ఇంచార్జిలే దిక్కయ్యారు. దీంతో కల్తీ రాజ్యమేలుతోంది. కల్తీల నియంత్రణపై పూర్తిగా పర్యవేక్షణ కొరవడింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆహార పరిరక్షణ ప్రమాణాల విభాగం ఆయా జిల్లాల్లో పనిచేస్తోంది. సంబంధిత ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ డిపార్ట్‌మెంట్‌కు లేబర్ డిపార్ట్‌మెంట్, ట్రేడ్ లైసెన్స్, కమర్షియల్ టాక్స్, సేల్స్ టాక్స్, లీగల్ మెట్రాలజీ, వాటర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లు ఇతరశాఖలు అనుసంధానంగా పనిచేస్తున్నాయి.

**కల్తీకి అడ్డేదీ?:** అడపదడపా సమచారమిస్తే పోలీసులే తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారు కూడా సంబంధిత శాఖలకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఫుడ్ సేఫ్టీ అదికారులు కల్తీ వస్తువులను, తినేపదార్థాలను టెస్టుల నిమిత్తం ల్యాబ్‌కు పంపించి నిర్ధారణకై వేచిచూస్తున్నారు. అది సరైనదో.. కల్తీ అవునో ఓ నాలుగు నెలల తర్వాత నిర్ధారించుకునే దుస్థితి నెలకొంది. ఈ శాఖకు ఉమ్మడి రాష్ట్రంలోనే హైదరాబాద్‌లో పరీక్షల కోసం ఒకే ఒక్క ల్యాబ్ ఉండడం... ఇంచార్జిలే దిక్కు కావడం.. సమస్యను మరింత జఠిలం చేస్తోంది.. ఇందులోనూ కాసులకు కక్కుర్తిపడే అధికారులు లేకపోలేదు.. ఫలితంగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులకు, కల్తీలు చేసే వ్యాపారులకు, ఇతర కల్తీ నిర్వాహకులకు అడ్డు అదుపూ లేకుండా పోయింది.

**వారికి లాభం.. వీరికి రోగం..:** ఎంత సంపాదించినా ఖర్చు విషయంలో ఆహార పధార్థాలకే అందరూ అధిక ప్రాధాన్యతను సాధారణంగా ఇస్తూ ఉంటారు.. తిండి విషయంలో రాజీ పడితే బతుకుబండి సాగదు.. అందుకే నాణ్యమైన పండ్లు, కూరలు, పప్పులు, నూనెలు, బియ్యం, ఇతర పధార్థాలు కొనాలని అందరూ భావిస్తుంటారు. ఈ భావనే కల్తీ వ్యాపారులకు బలంగా మారుతోంది. అదిక లాభాలకు ఆశపడి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు, నాసిరకం వస్తువులు కలిపి కొందరు వ్యాపారుల జేబులు నింపుకుంటున్నారు. ఒకప్పుడు కొన్ని రకాల పండ్లను రసాయనాలతో కృత్రిమంగా మగ్గించేందుకు మాత్రమే కార్బయిడ్ వంటి విషపూరిత రసాయనాలు వినియోగించేవారు. ఇప్పుడు అన్ని రకాల పండ్లను రసాయనాలతో కృత్రిమంగా మగ్గించి విక్రయిస్తున్నారు. దీంతో ఏ పండ్లను కొనాలన్నా జనం భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. దీర్ఘకాలంగా కల్తీ ఆహార పధార్థాలను తినడం, పానీయాలను సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడం ఖాయం.. కల్తీ ఆహారపదార్థాలు, పండ్లను తినడం వల్ల క్యాన్సర్లు, ఉదరకోశ , దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాధముంది. మహిళల్లో గర్భస్రావాలు పిల్లల్లో ఎదుగుదల లోపించడం, వృద్ధుల్లో నిద్రలేమి, అలసట వంటి అనారోగ్యాలు అనివార్యమవుతున్నాయి. జంతు కళేబరాలతో వంటనూనెలు, యూరియా వంటి రసాయనాలతో పాలు, హానికర పధార్థాలతో నెయ్యి, కృత్రిమంగా మగ్గపెట్టిన పండ్లు, ఇలా పూర్తిగా కల్తీ మయిపోయింది. కల్తీ వ్యాపారులు ఉగ్రవాదుల కన్నా ప్రమాదకరం అని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసినా కల్తీ నిరోధానికి ప్రభుత్వం, సంబంధిత శాఖలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు.

**ఆన్‌లైన్‌లోనే అనుమతులు:** ఫుడ్ సేఫ్టీ కాంప్లియన్ సిస్టం(ఎఫ్‌వోఎస్‌సివోఎస్) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో హోటళ్లు, రెస్టారెంట్లకు, ఇతర ఆహార పధార్థాలు విక్రయించే దుకాణాల వ్యాపారులు అనుమతులు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో అనుమతులు పొందే సమయంలో పొందుపరిచిన నియమనిబంధనలను నిర్వాహకులు పాటించడం లేదు. కరీంనగర్ జిల్లాలో సుమారు 500 పైగా హోటళ్లు, వందకు పైగా రెస్టారెంట్లు ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలో అనుమతులు లేకుండా కూడా హోటళ్లు, రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిలో కిచెన్, కస్టమర్ ఉండే పరిసర ప్రాంతాల్లో ఏ విధంగా శుభ్రంగా ఉండాలో కనీస నియమనిబంధనలు పాటించకపోవడం విస్తుగొల్పుతుంది. ఇటీవల జులై 30న కరీంనగర్ జిల్లా కేంద్రంలో నాసిరకం పధార్థాలతో తయారు చేసి విక్రయిస్తున్న 1075 కిలోల అల్లంను కరీంనగర్ పోలీస్ స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే..నగరంలోని ముకరంపుర గోదాంలో తనిఖీ చేయగా భారీ ఎత్తున అల్లం నిల్వలు పట్టుబడ్డాయి. అదే విధంగా నగర శివారులోని ఓ హోటల్‌లో కస్టమర్ భోజనంలో పెరుగులో పురుగులుండడతంలో వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశారు.. ఇలా నిత్యం ఏదో మూలన కల్తీ జరుగుతున్నాయి.. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్తీపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

# కర్షకుల కష్టం వర్షార్పణం

(మొదటి పేజీ తరువాయి..)

గత మూడేళ్లుగా రైతు పడుతున్న కష్టం పగవాడికి కూడా రాకూడదేమో.. భూమిని నమ్ముకుని సాగులోకి దిగిన రైతాంగానికి ఆదిలోనే ఆటంకాలు అడ్డుపడుతున్నాయి. ఇవి చాలదన్నట్లుగా ప్రకృతి విరుచుకుపడి పండినపంటను చేతికందకుండా చేస్తుండగా మరోవైపు తెగుళ్ల రూపంలో పంటను మధ్యలోనే తుంచేస్తున్నాయి. పండిన కాస్తా పంటకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశపడిన రైతన్నకు దళారులు మధ్యలోనే దండుకుంటున్నారు. మూడేళ్ల క్రితం పంట భారీగా దిగుబడి వచ్చినప్పటికీ పండినపంటకు తగ్గట్లు గిట్టుబాటు ధర లేక రైతులు దళారుల చేతిలో పంటను పెట్టాల్సి వచ్చింది. గత ఏడాది పంట బాగా పండుతుందని భావించినప్పటికీ తెగుళ్ల రూపంలో మధ్యలోనే పంట ఆవిరైపోయింది. ఈ ఏడాది తొలకరిలోనే విత్తనాలు నాటినా తొలిదశలోనే వానలు వరదలు భారీగా వచ్చాయి. తొలకరిలోనే రైతులు వ్యవసాయానికి సన్నద్ధం అవుతూ విత్తనాలు నాటుతుండగా మరికొందరు రైతులు విత్తనాలు నాటి మొక్కవచ్చే దశలోనే జులై మాసంలో కురిసిన భారీ వర్షాలకు విత్తనాలు పురిటిలోనే కనుమరుగయ్యాయి. వరుసగా మూడేళ్లుగా రైతాంగాన్ని కుంగదీస్తున్న తీరు రైతుకంట కన్నీళ్ళు తప్ప చెప్పుకోవటానికి ఏమీ మిగలలేదు.

# కార్మికులతో చెలగాటమాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**- ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్**

గోదావరిఖని, ప్రభాతవార్త.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులతో చెలగాటమాడుతున్నాయని ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ అన్నారు. బుధవారం సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని జిడికె 11ఎ గనిపై జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణకు అనుకూలంగా ఢిల్లీలో సంతకాలు చేసి నేడు టిఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులపై కపట ప్రేమ చూపిస్తున్నాయని, అలాగే కంపెనీలో నాడు 1.20లక్షల మంది కార్మికులుండగా నేడు 43వేల మంది కార్మికులున్నారని, నాడు 2500 మంది అధికారులు ఉండగా నేటికి వారు తగ్గలేదని అన్నారు. ఈ విధంగా కార్మికులను మాత్రమే తగ్గిస్తూ యాజమాన్యం కార్మికులపై పని భారం మోపుతున్నారని అన్నారు. అలాగే అండర్ గ్రౌండ్ గనుల్లో కాంట్రాక్టు కార్మికులను ప్రోత్సహించడం టిఆర్ఎస్, టిబిజికెఎస్‌ల లోపాయి కారి ఒప్పందం కాదా అని కార్మికులు ఆలో చించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎఎల్‌పి, శాంతి ఖని గనుల్లో వందల కోట్లు పెట్టుబడి పెట్టి నష్టాలు వస్తున్న వాటిని నడిపించడం వెనుక మర్మం ఏమిటో యువ కార్మికులు ఆలో చించాలని అన్నారు. ఈ విష యాన్ని కార్మికులు మరిచి పోవద్దని అన్నారు. అనంతరం రామగుండం ఏరియా వన్ 11ఎ గని నూతన ఫిట్ కమిటీని నియమించారు. 11ఎ ఫిట్ కార్యదర్శి గాదె సంపత్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పి.ధర్మపురి, సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి కుమారస్వామి, సెంట్రల్ కౌన్సెల్ మెంబర్ వి.లక్ష్మీపతి గౌడ్, సీనియర్‌జాయింట్ జనరల్ సెక్రటరీ, జిల్లా ఐఎన్‌టియుసి అధ్యక్షులు వి.దాస్, జాయింట్ జనరల్ సెక్రటరీలు గద్దం క్రిష్ణ, దేవులపల్లి రాజేందర్, గ్రూప్ బ్రాంచ్ కార్యదర్శి పోతరబోయిన సమ్మయ్య, అక్బర్ అలీ, ఆర్జీ 2 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, ఆర్జీ 3 వైస్ ప్రెసిడెంట్ కె.సదానందం, కో ఆర్డినేటర్ ఆర్జీ 2 వి.మార్కండేయ, ఆర్జీ 3 బ్రాంచ్ సెక్రటరీలు, 11ఎ గని ఇన్‌ఛార్జ్ సంపత్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి పృథ్వీరాజ్, ఇతర గనుల ఫిట్ కార్యదర్శులున్నారు.

## మున్సిపల్ లేఅవుట్‌లలో ఫ్రీడమ్ పార్కు ఏర్పాటు

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :



మున్సిపల్ పరిధిలోని 22వార్డులో లే అవుట్ స్థలంలో ఫ్రీడమ్ పార్కు ఏర్పాట్లుకు మొక్కలు నాటిన నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మొక్కలను బుధవారం నాటారు. ఈ సందర్భంగా నాఫ్స్కాబ్ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా అడవుల విస్తీర్ణం పెరగాలని సందేశాలతో 75ఆకారంలో మొక్కలు నాటాడం జరిగిందన్నారు. భారతదేశ ప్రజలలో జాతీయ సమైక్య భావంను దేశభక్తిని పెంపొందించేలా స్వాతంత్ర్య వజ్రోత్సవాలను ఇంటింటి జరుపుకోవాలని ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ కల్లూరి లత, కో ఆప్షన్ సభ్యులు మున్సిపల్ పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**- అధికారుల నిలదీతలు - పలు శాఖల అధికారులు గైర్హాజరు**

**- అధికారులపై మండిపడ్డ సభ్యులు**

ముత్తారం, ప్రభాతవార్త.



ముత్తారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి జక్కుల ముత్తయ్య పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశాన్ని చేపట్టారు. కొంత మేరకు సమావేశం సాదాసీదాగా జరిగినప్పటికీ పలు శాఖల అధికారుల గైర్హాజరుపై సభ్యులు మండిపడ్డారు. అంతేగాకుండా ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో అధికారులు సక్రమంగా ప్రజలకు అందుబాటులో లేకుండా విధులు నిర్వహిస్తున్నారని సభ్యులు నిలదీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఓ కలికోట శ్రీనివాస్, ఎంపివో వేణు మాదవ్, వైస్ ఎంపిపి సుదాటి రవీందర్ రావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పలు శాఖ అధికారులున్నారు.

## దేశభక్తిని గుండెల్లో నింపుకొని జాతీయ జెండాను రెపరెపలాడిద్దాం

**- పెద్దపల్లి డిసిపి చెన్నూరి రూపేష్**

మైటేంక్సయిన్‌కాలనీ, ప్రభాతవార్త.

జాతీయ సమైక్య వాదాన్ని చాటుతూ దేశ భక్తిని గుండెల్లో నింపుకొని జాతీయ జెండాను రెపరెపలాడిద్దాం అని రామగుండం పెద్దపల్లి డిసిపి



చెన్నూరి రూపేష్ అన్నారు. బుధవారం గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 75 సంవత్సరాల స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా భారత వజ్రోత్సవంలో వన మహోత్సవ ం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిపి రూపేష్ , ఎసిపి గిరి ప్రసాద్‌లు హాజరై మాట్లాడారు. దేశ అభ్యున్నతికి ఎందరో ప్రాణ త్యాగాల వల్ల ఏర్పడ్డ స్వతంత్ర భారత దేశంలో కుల మతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ జాతీయ భావంతో ఉండాలని అన్నారు. 75 వసంతాల స్వాతంత్ర దినోత్సవానికి ప్రతీకగా 75 మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సిఐలు కూచన శ్రీనివాస రావు, అఫ్జలోద్దీన్, ఎస్ఐలు శ్యాం పటేల్, కళాధర్ రావు, అహ్మదుల్లా, ఎఎస్ఐ రామలక్ష్మి, కానిస్టేబుల్ ఇమ్రోజ్ భార్గవ, మల్లీశ్వరి, నరేందర్, స్కూల్ విద్యార్థులు తదితరులున్నారు.

## మండలంలో వజ్రోత్సవ వేడుకలు

పాలకుర్తి, ప్రభాతవార్త.



మండలంలోని అన్ని గ్రామాల్లో భారత స్వాతంత్ర దినోత్సవ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ఇంటింటికి జెండాలను పంచారు. బుధవారం పాలక వర్గాలు అధికారులతో కలిసి ఫ్రీడం పార్కులను ఏర్పాటు చేశారు. కుక్కలగుడూర్‌లో, బసంతనగర్‌లో ఫ్రీడం పార్కులను ఏర్పాటు చేశారు. బసంతనగర్ తెలుగు మీడియంకు ఎదురుగా ఉన్నటువంటి స్థలంలో 75 సంవత్సరాల వజ్రోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రీడం పార్కును 75 ఆకారంతో ఏర్పాటు చేశారు. ఎంపిడిఓ లలితా, సర్పంచ్ కట్టెకోల వేణుగోపాల్ రావు, ఎంపివో షబ్బీర్ పాషా, ఎపివో అఖిల, పంచాయతీ కార్యదర్శి నరేష్, సిబ్బంది గుండా రమేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ లలిత మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. గురువారం ఫ్రీడం రన్ ఉంటుందని అన్నారు.

**మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులు...**

మండలంలోని పుట్నూర్ గ్రామంలో స్వాతంత్ర దినోత్సవ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకొని మొక్కలు నాటారు. సర్పంచ్ పున్నం శారద, రైతు సంఘం నాయకులు మదన్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, పున్నం సాగర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజవ్వ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆదర్శ పరస్పర సంఘం నూతన కార్యవర్గం

కోనరావుపేట, ప్రభాతవార్త



కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని ఆదర్శ పరస్పర సహాయం సహకార మార్కెటింగ్ పరపతి సంఘం నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కాటపల్లి వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శిగా తక్కళ్ల దామోదర్‌రెడ్డి, డైరెక్టర్లుగా తిపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్ల రవీందర్‌రెడ్డి, జవ్వాజి ఆగమల్లయ్య, నంద్యాడపు సాగర్, తక్కళ్ల బాపురెడ్డి, పన్నాల రవీందర్‌రెడ్డి, కాటపల్లి మహేందర్‌రెడ్డి, తిపిరెడ్డి లక్ష్మారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైనా నూతన కార్యవర్గం మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతమన్నారు.

## బిసి విద్యార్థి సంఘం అధ్వర్యంలో రక్ష బంధన్

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :



బిసి విద్యార్థి సంఘం అధ్వర్యంలో రక్ష బంధన్ వేడుకలను మహాత్మ గ్రామర్ హై స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేను నీకు రక్ష మనం ఇద్దరం దేశానికి రక్ష అనే నినాదం తో ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు అన్న చెల్లెళ్లగా కలిసి వుండాలని అన్నారు. హిందు సంస్కృతిని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇంచార్జి ఇల్లందుల ప్రకాష్, పాఠశాల కరస్పాండెంట్ శంకర్ రావు, నాయకులు నరేష్, వంశీ, గణేష్, నీరజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి కల్పించాలి

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :



సెస్ కార్మికులు పదోన్నతి కల్పించాలని సెస్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం జనవరిలో సెస్ సమస్యలు పరిష్కరిస్తామని ఎన్‌పిడిసిఎల్ ప్రకారం పదోన్నతులు కల్పిస్తామని ఇప్పటి వరకు సెస్ ఎండి ఎలాంటి కార్యచరణ చేయడం లేదని అన్నారు. మా సమస్యల పరిష్కారంలో ఎండి నిర్లక్ష్యదోరణి వహిస్తున్నారని ఆరోపించారు. మంత్రి కేటిఆర్ చొరవతో మాసమస్యలను పరిష్కరిస్తు, పదోన్నతులు కల్పించాలని అన్నారు. గతంలో ఎన్నో సార్లు నిరసనలు తెలియాజేయడం జరిగిందన్నారు. నేటి నుండి రిలే దిక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ విద్యుత్ సంఘం ప్రెసిడెంట్ రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ జహిర్, మహేందర్, రమేష్, రఘుపతి, శ్రీనివాస్, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు లీటర్ల నాటు సారాయి పట్టివేత

ముత్తారం, ప్రభాతవార్త.



ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో నాటుసారాయి అమ్మే వక్తుల ఇండ్లలో మంథని సిఐ జి.గురవయ్య ఆదేశాలతో ఎక్సైజ్ పోలీసులు బుధవారం తనిఖీ చేపట్టారు. ఓడేడు గ్రామానికి చెందిన దామ రోజా వద్ద 3 లీటర్ల నాటు సారాయి పట్టుబడగా ఆమెపై కేసు నమోదు చేసి అనంతరం తహశీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ సోదాల్లో ఎక్సైజ్ ఎస్ఐ సాయిరాం, సిబ్బంది సతీష్, శ్రీనివాస్, వసంత ఉన్నారు.

# చెట్లు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయి

**- ఎంపిపి**

వీణవంక, ప్రభాత వార్త:



చెట్లు పర్యావరణ పరిరక్షణకు ఎంతోగానో తోడ్పడతాయని ఎంపిపి ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి అన్నారు. 75వ స్వాతంత్ర్యం వజ్రోత్సవ వేడుకలలో భాగంగా ఎంపిపితో పాటు సర్పంచ్ పొదిల జ్యోతి మొక్కలు నాటడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ... చెట్ల పెంపకం ప్రతి ఒక్కరి భాద్యత అని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీనికి ముందు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీనివాస్, ఎంపిటిసి సవిత, ఎంపివో ప్రభాకర్, బీట్ ఆఫీసర్ అనంత రాములు, ఉప సర్పంచ్ రామిడి సంపత్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజల పాలిట వరం

**వైస్ ఎం.పి.పి సుదగోని శ్రీనాథ్‌గౌడ్**

ప్రభాత వార్త ఇల్లంతకుంట



ఇల్లంతకుట మడలం వంతడుపుల గ్రామానికి చెందిన కోమ్మెర భారతమ్మ ఇరుమల్ల శ్రీనివాస్ కీర్తి అశోక్ మల్లారెడ్డి రామని మల్లయ్య మద్దికుంట లింగయ్య కట్కూరి సాయి చరణ్ లకు 1.66.500రూపాయలు చెక్కులు మండల వైస్ ఎంపిపి సుదగోని శ్రీనాథ్ గౌడ్ సర్పంచ్ కట్ట వెంకట్ రెడ్డి అందించారు వైస్ ఎంపిపి మాట్లడుతు నిరుపెద కుటుంబలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ సంక్షేమ ఫథకాలు ప్రతి పేదవాడికి చేరుతున్నాయిన్నా అన్నారు ఈ సందర్భంగా మానకోండూర్ శాసన సభ్యులు రసమయి బాలకిషన్ కు దన్యవాదలు తేలిపారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎదిరే శేఖర్.దురుముట్ల శ్రీనివాస్ లెంకపెల్లి లచ్చయ్య.గనగోని రాజశేఖర్ తదితరులు పాల్గోన్నారు

# కొడిమ్యాలలో 75వ భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలు

కొడిమ్యాలప్రభాతవార్త:



ఎంపిపి మేనేని స్వర్ణలత రాజనర్సింగరావు 75వ భారత స్వాతంత్ర్య వజ్రోత్సవంలో బాగంగా నాచుపల్లి గ్రామంలో జాతీయ జెండాలు పంపిణి చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మజ, ఎంపిఒ గంగాధర్, ఏపిఒ సతీష్, సర్పంచ్‌లత తిరుమలేష్, సెక్రటరీ శేఖర్, కారోబార్ చారీ వార్డుసభ్యులు తెరాస మండల ఉపాధ్యాక్షులు రొడ్డ శరత్, ఎస్సి సెల్ అద్యక్షులు నెరెల్ల మహేష్, డైరెక్టర్ దేవయ్య, అంగన్‌వాడి టీచర్స్ ఆశ వర్కర్స్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు తెరాస నాయకులు, తదితరులు పాల్గోన్నారు.

# పూడురులో 75 వసంతాల స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాలు

కొడిమ్యాల ప్రభాతవార్త:

పూడరులో 75 వసంతాల స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాలలో భాగంగా పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం పాటల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అర్కాల శ్రీనివాస్ మాట్లాడుతూ మహానీయుల త్యాగాలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, రాజేశ్వర్, జ్యోతిబాయి, క్రాఫ్ట్, ఆర్ట్ టీచర్లు ఆనంద్, మంజుల తదితరులు పాల్గోన్నారు.

# క్రీడలలో గెలుపొందిన వారికి సన్మానం చేసిన పాలకవర్గ సభ్యులు

ఓదెల, ప్రభాత వార్త:



ఓదెల మండలంలో ఓదెల భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులు వరంగల్ జోన్ పరిధిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించగా మన దేవాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొని విజయం సాధించారు. ఇందులో జోనల్ చెస్‌లో మొదటి బహుమతి ముద్దసాని కుమారస్వామి, రన్నింగ్‌లో రన్నర్‌గా నాగవెల్లి రాజయ్య, క్యారంలో బహుమతి ఎం. సుధీర్, ఈ. రమేష్ విజయం సాధించారు. వారికి బుధవారం దేవాలయంలో శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయం పాలకవర్గ సభ్యులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, కనికిరెడ్డి సతీష్, చింతం వెంకటస్వామి, రౌతు స్వర్ణలత, జలపతి, కో ఆప్షన్ సభ్యులు ప్రధాన అర్చకులు డి. వీర భద్రయ్య, పెద్దపల్లి మార్కెట్ కమిటి డైరెక్టర్ బోడకుంట నరేష్, దేవాలయ సిబ్బంది భూమయ్యలు వారిని శాలువాలతో సన్మానించి వారికి అభినందనలు తెలిపారు.

# పోస్టల్ ఉద్యోగుల ఒకరోజు సమ్మె విజయవంతం

**- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఉద్యోగులు**

**- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు**

**- పెన్షనర్ల సంఘం, చిన్నమొత్తాల ఏజెంట్ సంఘాల మద్దతు**

చొప్పదండి ప్రభాతవార్త:



తపాల శాకను ప్రైవేటికరణ చేయాలని చూస్తున్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు బుదవారం కరీంనగర్ ప్రధాన తపాల శాక ఎదుట సమ్మె చెపట్టారు. ఈ సమ్మెలో చొప్పదండి జిడిఎస్ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెన్షనర్ల సంఘం, చిన్నమొత్తాల సంఘాల నాయకులు పాల్గోని మద్దతు తెలిపారు. ఈ సమ్మెలో పాల్గోన్న వివిధ విభాగాల యూనియన్ నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలతో అనుబంధం ఉన్న పోస్టల్ శాఖను ప్రైవేటికరణను నిలిపివేయాలని పోస్టల్ ఖాతాలను పేమెంట్ బ్యాంకుకు బదిలీ చేయకూడదని నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు డిఆర్ డిఎను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగులు కోవిడ్ కారణంగా చనిపోయినవారి కుటుంబాలకు ఇవ్వాల్సిన పారితోషికం వెంటనే విడుదల చేయాలని కారుణ్య నియామకాలు వంద ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు ఎ. రమేష్, ఎ. రామచంద్రం, అనిల్, సుధాకర్ దేవి, గంగన్న, కోడూరి రాజశేఖర్,దొంత లక్ష్మణ్ బావన, శైలజ, సుధాకర్‌లు తదితరులు

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

కొడిమ్యాల ప్రభాతవార్త:



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం హిందూవాహిని ఆద్వర్యంలో కొడిమ్యాల మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల జూనియర్ కళాశాల లో సామూహిక రక్షబందన్ వేడుకలు నిర్వహించారు. సమాజంలో హెచ్చు తగ్గులు, కుల విద్వేషాలు, అసమానతలుకు అతీతంగా ముందుగా మనం భారతమాత సంతానం అని మనం అంతా సోదరులమని మనమంతా ఐక్యంగా ఉన్నప్పుడే మన దేశం సుభిక్షంగా ఉంటుందని అందుకే ఈ రక్షబందన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపమండల్ ప్రముఖ్ మంచాల శ్రీనివాస్, హిందువాహిని మండల అద్యక్షులు కోలా శ్రీనివాస్, స్వయం సేవకులు, హిందు వాహిని కార్యకర్తలు పాల్గోన్నారు.

# మధ్యాహ్న భోజనం పరిశీలన

**- బడిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం**

**- సర్పంచ్ మధు**

ఓదెల, ప్రభాత వార్త:



ఓదెల మండలంలోని హరిపురం గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం పెట్టే భోజనాన్ని బుధవారం సర్పంచ్ గుండేటి మధు యాదవ్ పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధు మాట్లాడుతూ... మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్రం సిఎం కేసీఆర్ ప్రతిష్టాత్మక కార్యక్రమం సన్న బియ్యంతో పెడుతున్నటువంటి మధ్యాహ్నం భోజనాన్ని బుధవారం పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ఆవుల శ్రీనివాస్, హెచ్ఎం మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడులో ముమ్మాటికి మేమే గెలుస్తాం

**- దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయుడు కేసిఆర్**

**- చొప్పదండి నియోజక వర్గ యువనేత వివేకానంద**

చొప్పదండి ప్రభాతవార్త:



మునుగోడు నియోజకవర్గంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగిన మేమే గెలుస్తామని కెటిఆర్ యువసేనా రాష్ట్ర అద్యక్షులు చొప్పదండి నియోజక వర్గ తెరాస నాయకుడు వివేకానంద ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలౌతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనికి తోడు కొత్తగా 57 సంవత్సరాలు నిండిన 10 లక్షల మందికి పెన్షన్లు మంజూరు అయ్యాయని దీంతో రాష్ట్రంలో పెన్షన్ లబ్దిదారుల సంఖ్య 46 లక్షలకు చేరిందని గుర్తు చేశారు. అదేవిధంగా డయాలసిస్ రోగులకు కూడా మొదటిసారిగా పెన్షన్ మంజూరు చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ పథకంతో 12 వేల మంది డయాలసిస్ రోగులకు ప్రభుత్వం ఆసరా ఇవ్వనుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రైతన్నల కోసం రాష్ట్రమంతా ఎక్కడ చూసినసాగునీరు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తూ రాష్ట్రాన్ని సుభిక్షంగా తీర్చిదిద్దిన కెసిఆర్ ప్రజల గుండెల్లో నిలిచి పోయడాని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం ద్వారా ఆడపిల్లల పెళ్ళిళ్లకు అండగా నిలిచిన మేనమామగా అందుకుంటున్న కెసిఆర్ ప్రజలు గుండెల్లో పెట్టుకుని గెలిపించు కుంటారని ఆయన అన్నారు. ఏదిఏమైనా గెలుపుమాదేనని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు.

# వజ్రోత్సవ వేడుకల్లో మొక్కలు నాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

కొడిమ్యాల ప్రభాతవార్త:



వజ్రోత్సవ వడేకల్లో భాగంగా బుధవారం కొడిమ్యాల మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు 75 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం పర్యావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాద్యతగా బావించాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు దేశభక్తి జాతీయ సమైక్యత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు అంశాలలో పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. మోహన్, ఉపాధ్యాయులు శ్రీదర్, జగదీష్, లత, స్వప్న,ఇందిర, అంజలి, సౌజన్య, అనూప్, తదితరులు పాల్గోన్నారు.

# జెఎన్‌టీయూలో వజ్రోత్సవ వేడుకలు

రామగిరి-ప్రభాతవార్త

భారత స్వాతంత్ర వేడుకల్లో భాగంగా రామగిరి మండలంలోని సెంటీనరీకానీలో గల మంథని జెఎన్‌టీయూహెచ్ యూనివర్సిటి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఘనంగా ఆజాదిక అమృత్ వజ్రోత్సవ వేడుకలల్లో భాగంగా పలు క్యాక్రమాలను నిర్వహించారు. వివరాల్లోకి వేళ్ళితే రామగిరి మండలంలోని సెంటీనరీకానీలో గల మంథని జెఎన్‌టీయూహెచ్ యూనివర్సిటి ఇంజనీరింగ్ కళాశాలలో దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల అవుతున్న క్రమంలో ఆజాదిక అమృత్ మహోత్సవ వజ్రోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాలను పూలతో ఆలకరించారు. అదే విధంగా కళాశాలలో భారతమాత చిత్రాలతో పాటు వివిధ చిత్రాలను వేశారు. అనతరంలో 75 వంసతాలను పుర్కరించుకొని 75 మొక్కలను నాటారు. ఈ



కార్యక్రమంను విక్షించిన వైస్ ప్రిన్సపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డితో పాటు హెచ్ఓడి దుర్గారావు, దర్గా కుమార్, కృష్ణారెడ్డి, అధ్యాపకులు విద్యార్థులను ప్రత్యేకంగా అభిందించారు. పోలీస్ స్టేషన్‌లో, ఆయా గ్రామాల్లో వజ్రోత్సవ కార్యక్రమాలు రామగిరి మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎసై కటికె రవిప్రసాద్, తాసీల్దార్ రాంమ్మోహన్‌లు, అదే విదంగా ఆయా గ్రామాల్లో లొంక్కకేసారం, కల్వచర్ల, పన్నూరు, రత్నాపూర్, నాగేపల్లి, బేగంపేట్, నవాబ్‌పేట్, ఆదివారంపేట్, రాజాపూర్, తదితర గ్రామాల్లో ఆజాదిక అమృత్ వజ్రోత్సవ వేడుకలల్లో భాగంగా వారి వారా గ్రామల్లో మొక్కలను నాటారు. అనతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల అవుతున్న క్రమంలో ఆజాదిక అమృత్ మహోత్సవ వజ్రోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని సర్పంచ్‌లు ఎండి. మంజూరు, గంట పద్మ, పల్లె ప్రతిమ, కొండవేన ఓదేలు యాదవ్, బుర్ర పద్మ, మైదం కుమార్, పాశం ఓదేలు యాదవ్‌లు కోరారు. ఈ కార్యక్ర మాల్లో ఎంపిడిఓ రమేష్, మండల ప్రత్యేక అధికారి, ఎంపిఓ, కార్యదర్శులు తదితరులున్నారు.

## విద్య వైద్య ఉపాధిపై సమన్యాయానికై ఉద్యమం

**సామాన్యుడు సంస్థ వ్యవస్థాపకుడు న్యాతరి శ్యాంసుందర్**

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:



ప్రజలందరికీ విద్య వైద్యం ఉపాధిపై సమన్యాయం జరిగే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని సామాన్యుడు-చీకటి నుంచి వెలుగుకు సంస్థ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్ అన్నారు. బుధవారం సంస్థ ఆద్వర్యంలో మొట్టమొదటి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నగరంలోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించారు. ఈ సంధర్బంగా శ్యాం సుందర్ మాట్లాడుతూ ఒకే విద్య.. ఒకే వైద్యం, సమాన పనికి సమాన వేతనం లక్ష్యంగా చట్టసభల్లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను చైతన్యవంతం చేసి ప్రభుత్వాలతో రాజ్యాంగబద్ధమైన పోరాడతామన్నారు. కార్యక్రమంలో మాజీ అదనపు డిప్యూటీ కలెక్టర్ గంగారాం, మేడి రాజవీరు. జేఏసీ చైర్మన్ బొత్త వెంకటమల్లన్న, గౌరవ సలహాదారు జింక మల్లేశం, సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి కండె సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు న్యాతరి రవీందర్, సదానందం, రవీందర్, జిల్లా అధ్యక్షుడు పొత్తూరి రాజేందర్, సంతోష్‌రెడ్డి, పొత్తూరి రాజేందర్, బొంగోని శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, సదానంద యాదవ్, అన్వేష్, సాయినాథ్, సాయి, అంజయ్య, తాండ్ర నర్సయ్య, గొర్రె రాజయ్య, నాయకులు నక్క లక్ష్మణ్, శమిర్, అంజద్, షరీఫ్ తదితరులున్నారు.

## దేశ సమైక్యతను చాటడంలో యువత ముందుండాలి

**ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు రామారావు**

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:



సేవా కార్యక్రమాలు నిర్వహించి భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని,దేశ సమైక్యతను చాటడంలో యువత ముందుండాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. బుధవారం భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సంధర్బంగా ఓసి సంఘాల జేఏసీ ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్బంగా విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించే కేబినెట్ మీటింగ్‌లో కేసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఓసి పేదల సంక్షేమానికి ప్రత్యేక కార్పోరేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాలు ముగిసే ఈ నెల 22లోగా రెడ్డి వైశ్య కార్పోరేషన్లు, ఇతర ఓసిల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఓసి సంఘాల జేఏసీ తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నెల 24న వేలాది మందితో ప్రగతి భవన్ ఎదుట ధర్నా నిర్వహించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి కెసిఆర్‌కు రామారావు విజ్ఞప్తి చేశారు.

## ఫ్రీడం రన్‌ను విజయవంతం చేయాలి

కరీంనగర్‌స్పోర్ట్స్, ప్రభాతవార్త:



స్వాతంత్ర్య వజ్రోత్సవాల సంధర్బంగా గురువారం నిర్వహించే ఫ్రీడం రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా వయోజన, క్రీడాశాఖ అధికారి రాజవీరు తెలిపారు. బుధవారం జిల్లా యువజన, క్రీడాశాఖ ఆద్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో సమావేశం జరిగింది. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీడం రన్ అంబేద్కర్ చౌరస్తా నుంచి తెలంగాణ చౌక్ వరకు సాగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు జిల్లాలోని నాయకులు, అధికారులందరూ పాల్గొంటారని తెలిపారు. ఫ్రీడం రన్ విజయంతానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు, పెటా అసోసియేషన్ సభ్యులు, యువజనులు, పిటిలు, పిడిలు, జిల్లా వయోజన క్రీడాశాక సిబ్బంది, ప్రాంతీయ క్రీడా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు అభినందనలు తెలిపిన లాయక్ పాషా

వేములవాడ, ప్రభాతవార్త :



తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా మూడవసారి బాధ్యతలు చేపట్టిన అల్లం నారా యణకు హైదరాబాదులోని కార్యాల యంలో కలిసి బుధవారం జర్నలిస్టు సంఘం 143 రాష్ట్ర నాయకులు లాయక్ పాషా పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. జర్నలిస్ట్ సమాజం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న అల్లం నారాయణకు మరోసారి మీడియా అకాడమీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ మంత్రి కేటి రామారావుకు, ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 13న జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొండి

మంథని రూరల్ - ప్రభాతవార్త

ఈనెల 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మంథని ప్రిన్సపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, అడిషనల్ జడ్జి స్వాతి తెలిపారు. ఈ సందర్బంగా కక్షిదారులు రాజీ కుదుర్చుకుని వస్తే కేసులను తొలగిస్తామని రాజీ మార్గమే రాజామార్గమని వారు తెలిపారు. భూతగాదాలకేసులు, బార్యభర్తల కేసులు, చెక్‌భౌన్స్ కేసులు మొదలైనవి రాజీకుదుర్చుకోవచ్చునని అన్నారు. దీనిని క్షక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## మనమందరం కలిసి సింగరేణికి పరిరక్షణకు ఉద్యమిద్దాం:యాదగిరి

**బిఎంఎస్ ఆధ్వర్యలో రాఖీ వేడుకలు**

రామగిరి-ప్రభాతవార్త



నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనమందరం కలిసి సింగరేణి సంస్థ పరిరక్షణకు కలిసి కట్టుగా ఉద్యమిద్దాంమని బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య బుధవారం అన్నారు. వివరాల్లోకి వేళ్ళితే రామగిరి మండలంలోని సింగరేణి సంస్థ ఆర్జీ3 ఏరియాలోని ఓసిపి2 గని అవరణలో బిఎంఎస్ ఉపాధ్యక్షులు అరుకాల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా హాజరైన అధ్యక్షులు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థ సంపదను కాపాడుకోవడంకు మనమందరం కలిసి కట్టుగా సోదర భావంతో ఐక్యమత్యంతో పని చేస్తూ సంస్థకు మెరుగైన లాభాలను అందిద్దామని అన్నారు. అనతరంలో బిఎంఎస్ ఆధ్వర్యంలో మహిళ ఉద్యోగులు ముందస్తుగా రాఖీలను తోటి సోదరులకు కట్టి శుభాక్షాంలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి స్వామి, విద్యాసాగర్, కొంద్ర ఐలయ్య, సాయవేణి సతీష్, సత్యనారాయణ, శ్రీకాంత్ మాదాసు రవీందర్, తదితరులున్నారు.

## రైతు బీమా గడువు పొడిగింపు

**జిల్లా వ్యవసాయ అధికారి వి.శ్రీధర్**

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:

రైతు బీమా గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఆగస్టు 13 వరకు నమోదు చేసుకోవచ్చని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని 5వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. కాగా 2022 ఆగస్టు 1 వరకే ధరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్త పాసుబుక్కు (22 జూన్ 2022 వరకు వచ్చినవి) కలిగిన రైతులు, ఇంతకు ముందు నమోదు చేసుకోని రైతులు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది.దురదృష్టవశాత్తు రైతు ఏ విధంగా చనిపోయినా ఆ కుటుంబానికి 10 రోజుల్లోనే రూ.5 లక్షల బీమా సొమ్ము అందుతున్న విషయం తెలిసిందే. ఇంటి పెద్ద చనిపోతే ఆయా కుటుంబాలు వీధిన పడకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతు బీమా అమలు చేస్తోంది. ఆగస్టు 13 తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా వ్యవసాయ అదికారి వాసిరెడ్డి శ్రీధర్ కోరారు.

## గుంజపడుగు మండలాన్ని ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి

**- మాజీ మంత్రి ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు**

మంథని రూరల్ - ప్రభాతవార్త



రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పాటు చేస్తున్న ప్రక్రియను ప్రారంభించిన నాటినుండే తాము గుంజపడుగును మండలంగా ఏర్పాటు చేయాలని 2018నుండి తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానని ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమానికి స్పందించి ప్రభుత్వం వెంటనే గుంజపడుగును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం గుంజపడుగు గ్రామంలో మండలం కోసం నిరహారదీక్ష చేస్తున్న శిబిరం వద్దకు వెళ్లి వారికి సంఘీభావంగా దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గుంజపడుగు గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ప్రభుత్వ భూమి కూడ పుష్కలంగా ఉందని భవిష్యత్తులో కార్యాలయాలను నిర్మించు కోవటానికి వీలుంటుందన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, గుంజపడుగు మాజీ సర్పంచ్ ఊదరి ఓదెలు, సీనియర్ నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, జంజర్ల శేఖర్, మాజీ జడ్పీటీసీ మూల సరోజన, అయేషా ఫాతిమా, యూత్ కాం గ్రెస్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, బూడిద శంకర్, రాంరాజశేఖర్, ఇందారపు అనిల్, ఆరెల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని అభివృద్ధి సంక్షేమం వైపు నడిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీది

**- ఆజాదీ కా గౌరవ్ యాత్రలో ఏఐసిసి కార్యదర్శి శ్రీధర్‌బాబు**

మంథని - ప్రభాతవార్త



భారతదేశానికి స్వాతంత్ర్యం సముపార్జించటంలో కీలక పాత్ర పోషించి స్వాతంత్ర్యం సాధించిన అనంతరం దేశాన్ని అభివృద్ధి సంక్షేమం వైపు నడిపించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఏఐసిసి కార్యదర్శి మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. ఆజీదీ కా గౌరవ్ యాత్రలో భాగంగా బుధవారం మంథని మండలంలోని గుంజపడుగు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవలను కాంగ్రెస్ నాయకుల త్యాగాలను ప్రజలకు కాం గ్రెస్ నాయకులు వివరించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పారీ ్ట స్వాతంత్ర్యం పోరాటం నుండి నేటి వరకు త్యాగాల చరిత్ర ఉంద న్నారు. ఆజీదీకా గౌరవ్ యాత్రంలో భాగంగా స్వాతంత్ర ్య వీరులకు శ్రద్దాంజలి ఘటిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆగస్టు 15వరకు 75కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహిం చాలన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వారి చరిత్రను నేటి తరాలకు తెలియ జేసేవిధంగా ముందుకు సాగాలన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించటానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన అంబేద్కర్‌ను నియమించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బిజెపి పాత్ర శూన్యమన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యగా ఈడీ ద్వార కాంగ్రెస్ అధినా యకత్వాన్ని వేదింపులకు గురి చేస్తుందన్నారు. నేటి యువతరం స్వాతంత్ర్యం పోరాటాని ౨ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలాన్నిరు. గుంజపడుగులో ప్రారంభించని పాదయాత్రలో పాల్గొన్న శ్రీధర్‌బాబు గుంజ పడుగుతో ఆపాటు ఉప్పట్ల గ్రామం వరకు పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, మండల కాంగ్రెస్ అద్యక్షుడు సెగ్గెం రాజేశ్, పార్టీ సీనియర్ నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, జంజర్ల శేఖర్, ఆజీంఖాన్, కుడుదుల వెంకన్న, పోలు శివ, పేరవేన లింగయ్యయాదవ్, రావికంటి సతీష్, బండారి ప్రసాద్, అయషా ఫాతిమా, మాజీ జడ్పీటీసీ మూల సరోజన, మార్కాక నిహారిక, అలీం, ఊదరి ఓదెలు, మంథని సత్యం, సీమ ఒతుల ఓదెలు, వేల్పుల పోచం, బూడిద శంకర్, రాంరాజశేఖర్, ఎరుకుల ప్రవీణ్, ఆరెల్లి కిరణ్‌గౌడ్, ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య అమృతోత్సవాలకు ఆహ్వానం

మంథని రూరల్ - ప్రభాతవార్త



75సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ అమృతోత్సవాల్లో భాగంగా మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే శ్రీదర్‌బాబు ఆహ్వానిస్తూ బుధ వారం విద్యార్థి యువత అధ్యక్షుడు కొండేల మారుతి ఆహ్వాన పత్రికను అందించారు. ఆయన నివాసంలో కలిసి 75వ స్వాతంత్ర్య అమృతోత్సవాలను పురస్కరించుకుని మంథనిలో వివిధ వర్గాల వారితో కలిసి నిర్వహించే సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆహ్వానించారు. ఈనెల 15వ తేదీన నిర్వహించే ఈ సమ్మేళన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులు పాల్గొంటారని కొండేల మారుతి తెలిపారు.

## ఘనంగా ఎస్సై సతీష్ జన్మదిన వేడుకలు

కోరుట్ల, ప్రభాతవార్త



పట్టణంలో పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వ హిస్తున్న ఎస్సై చిర సతీష్ జన్మదిన వేడుకలు కోరుట్ల సీఐ రాజశేఖర్‌రాజు ఆధ్వ ర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్, హరిత హారం కార్యక్ర మంలో భాగంగా స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పలు యువజన సంఘాల సభ్యులు ఎస్సై సతీష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్యామ్‌రాజ్, 22వార్డు బిలాల్‌పుర టీఆర్ఎస్ మైనార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి ఎండి.అర్భాజ్, మసీద్ కమిటీ సదర్, జానీ, వకీల్, రఫీ, అర్షద్‌ఖాన్, అఫ్రోజ్, బాబా,మజిద్ పాల్గొన్నారు.

## శ్రీవేంకటేశ్వరాలయంలో "యాగశాల"

కోరుట్ల, ప్రభాతవార్త



పట్టణంలోని అతిపురాతనమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దాతలు పాత రమ్యగీత-రాజేష్ ఆధ్వర్యంలో "యాగశాల" సుదర్శన హోమ ంతో అర్చకులు బీర్నంది నరసింహాచారి, ప్రవీణ్‌లచే ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం యాగశాల నిర్మాణ దాతలన, సుదర్శన హోమం నిర్వాహణ దాతలను ఆలయ పక్షాన శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ హోమంలో కొండూరి సురేష్-కుమార్-నవరసమాల, ప్రవళిక-ఉమేష్‌చైతన్య, త్రివేణి-తరుణ్ చైతన్య, ఈఓ విక్రమ్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ పెడిపల్లి నర్సయ్య, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దళితబంధు యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి కొప్పుల

వెల్గటూర్, ప్రభాతవార్త :



మండల కేంద్రం వెల్గటూర్‌లో కిషన్‌రావుపేటకు చెందిన దళితబంధు లబ్ధిదారు అలుగునూరి సతీష్ ఏర్పాటు చేసిన సూర్య మొబైల్, మరియు ఆన్‌లైన్ సెంటర్‌ను బుధవారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. అనంతరం ఆయన దళితబంధు పథకం ద్వారా దళిత నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా దళితుల సంక్షేమం కోసం దళితబంధు బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టారని మంత్రి తెలిపారు. దశలవారీగా ఏ పథకాన్ని రాష్ట్రంలోని దళితులందరికీ వర్తింపజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎండపల్లి మండల భవన సముదాయం ప్రజలకు అందుబాటుగా ఉండాలి

**- తెరాస రాష్ట్ర నేత పొనుగోటి శ్రీనివాసరావు**

వెల్గటూర్, ప్రభాతవార్త :



పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన మండలం ఎండపల్లి భవన సముదాయం అందరికీ అందుబాటులో ఉండేవిధంగా రహదారిని ఆనుకొని ఏర్పాటు చేయాలని తెరాస రాష్ట్ర నేత పొనుగోటి శ్రీనివాసరావుతో పాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. బుధవారం కరీంనగర్‌లోని మంత్రి కొప్పుల ఈశ్వర్ నివాసంలో ఎండపల్లి మండల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ తెరాస రాష్ట్ర నేత పొనుగోటి శ్రీనివాసరావు మరియు నూతన మండలాల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన మండలాల ఏర్పాటుతో ప్రజల చెంతకు సుపరిపాలన చేరువ అవుతుందని, మండల కార్యాలయాలు అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర రహదారిని ఆనుకొని లేదా ఎండపల్లి శివారు జగిత్యాల రహదారికి దగ్గరలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

**-వైయస్ఆర్ టిపి డిమాండ్**

చందుర్తి, ప్రభాతవార్త :



వీఆర్ఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వైయస్ఆర్‌టిపి జిల్లా నాయకులు చొక్కాల రాము, ఎర్రం నర్సయ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో వీఆర్ఏలు గత 20 రోజుల నుండి నిరసన దీక్షలు చేపడుతున్నారు. వీరికి బుధవారం వైయస్ఆర్ టిపి నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలకు పే స్కేల్ ఇవ్వాలని, అలాగే అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలు

మెట్‌పల్లి - ప్రభాతవార్త :



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని 12వ వార్డు అర్బన్ కాలనీలో స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా ఉదయం 8గం.లకు అర్బన్ కాలనీలో వాటర్ టాంక్ దగ్గర వన మహోత్సవంను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోవైస్‌చైర్మెన్ చంద్రశేఖర్‌రావు, కమీషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు గంగాధర్, కిషోర్, పురుషోత్తం, భవాని సత్యం, వరలక్ష్మి, రాజారాం, రాజేశ్వర్‌గౌడ్, మధులత, ఎండి షాకీర్, చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, హనుమాన్లు, జియా, ఆధికారులు వెంకట్ లక్ష్మి, డిఈ రాజ్‌కుమార్, ఏఈ అరుణ్‌కుమార్, మెప్మా, ఆర్పీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...**

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వతంత్ర్య భారత వజ్రోత్సవ వేడుకలు, హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాలలో మామిడి ఆకుల తోరణాలు, రంగ వళ్ళికలు, విద్యార్థులతో పాటు ఇతరులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపకులు బిల్ల రాజేంధర్, ఎ.మనోజ్‌కుమార్, కె.వెంకయ్య, మధుబాబు, అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

మల్లాపూర్ - ప్రభాతవార్త :



మల్లాపూర్ మండల కేంద్రంలో గత 45సం.లుగా సేవలందిస్తున్న పోస్ట్ మాస్టర్ పంచతి మల్లయ్యకు వీడ్కోలు సన్మాన్ని క్లబ్ అధ్యక్షుడు డా.స్వామి బుధవారం ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ రవీందర్ మాట్లాడుతూ 45సం.లుగా పంచతి మల్లయ్య పోస్ట్ మాస్టర్‌గా అందించిన సేవలను కొనియాడారు. యువకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం కొండలాద్రి, ఇతరులు ఆయనకు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాటిపెల్లి సరోజ, ఎంపిడిఓ రాజశ్రీనివాస్, ఎంపిటిసి ఆకుతోట రాజేష్, ఎంపిఓ జగదీశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్వతంత్ర్య వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్

**గొల్లపెల్లి ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలోని స్వతంత్ర్య వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మూడవ రోజున గ్రామగ్రామాన మొక్కలు నాటడం,ఫ్రీడం పార్క్ ఏర్పాటు కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర ్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ భారత దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవము సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ 15 రోజుల పాటు చేపట్టిన స్వాతంత్ర్య వజ్రోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. ఇందులో భాగంగా గొల్లపెల్లి మండల కేంద్రంలో వజ్రోత్సవ వన మహోత్సవ (ఫ్రీడం పార్క్) కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని మెక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యంపిపి నక్క శంకర్,జడ్పిటిసి గోస్కుల జలేంధర్,వైస్ ఎంపిపి ఆవుల సత్యం,పాక్స్ చైర్మన్ వెంకట మాధవ రావు,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ముస్కు లింగారెడ్డి,వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బోయపోతు గంగాధర్,టిఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లం రమేష్,ప్రధాన కార్యదర్శి చౌటపెల్లి తిరుపతి, రైతు సమన్వయ సమితి సభ్యులు ఒరుగంటి అశోక్‌రావు, ప్రజాప్రతినిదులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీలక్ష్మి నర్సింగ్ హోమ్ ప్రారంభించిన కలెక్టర్ జి రవి, ఎమ్మెల్యే సంజయ్





**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** జగిత్యాల పట్టణంలో శ్రీలక్ష్మి నర్సింగ్ హోమ్‌లో అన్నపూర్ణ కిడ్నీ కేర్‌ను ప్రారంభించిన జగిత్యాల జిల్లా ఎమె ్మల్యే డా.సంజయ్ కుమార్, జెడ్పి చైర్‌పర్సన్ దావా వసంత, జిల్లా కలెక్టర్ రవిలు బుదవారం ప్రారంభించారు. వైద్యులు వృత్తిలో భాగంగా అనాద రోగులకు సేవలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టరు లత, మున్సిపల్ వైస్ చైర్‌మెన్ గోలి శ్రీనివాస్,కౌన్సిలర్ చుక్క నవీన్,పట్టణ వైశ్య సంఘ అద్యక్షులు మంచాల కృష్ణ, జిల్లా అధికారులు సాయి బాబా,చందన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీడం పార్క్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా సంజయ్

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** భారత దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవము సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ 15 రోజుల పాటు చేపట్టిన స్వాతంత్ర్య వజ్రోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో వజ్రోత్సవ వన మహోత్సవ (ఫ్రీడం పార్క్) కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొని మెక్కలు నాటారు.అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్ రక్షా బంధన్ సందర్భంగా ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.జెడ్పిహెచ్ఎస్ స్కూల్ విద్యార్ి ్ధని,విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమ ంలో సర్పంచ్ నారాయణ, ఎయంసి చైర్మన్ నక్క రాద రవీంధర్,రెడ్డి,ఎపిటిసి శ్రీనివాస్,ఉప సర్పంచ్ శేఖర్ రెడ్డి,జెడ్పి సిఈవో రామానుజ చార్యులు,జిల్లా అటవి శాఖ అధికారి వెంకటేశ్వర రావు,డిపివో నరేష్ ,రూరల్ ఎంపిడివో రాజేశ్వరి, ఎమ్మార్వో నవీన్,ఎంపివో రవి బాబు, ఏపిఎం గంగాధర్, జెడ్‌పిహచ్ఎస్ ప్రధానోపాద్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అదికారులు, నాయకులు పాల్గొన్నారు.





## గాంధేయ మార్గంలో చెవులు మూసుకొని వీఆర్ఏల నిరసన

**ప్రభాతవార్త, ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు చేస్తున్న నిరవధిక సమ్మె 17వ రోజులో భాగంగా గాంధేయ మార్గంలో చెవులు మూసుకొని శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏ జేఏసి చైర్మన్ భైరుమల్ల తిరుపతి మాట్లాడుతూ 17 రోజులుగా వీఆర్ఏలు రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం గుర్తించక పోవడం బాధాకరమని, ముఖ్యమంత్రి కేసీఆర్ 2020 సెప్టెంబర్ 9న నూతన రెవెన్యూ చట్టం తీసుకొస్తున్న సందర్భంలో రాష్ట్రంలోని 23,000 వేల మంది వీఆర్ఏలు గ్రామస్థాయిలో పనిచేస్తున్నారని దీనిలో అధిక మంది బడుగు బలహీన వర్గాలకు వెనుకబడిన తరగతులకు చెందిన వారని, వారి సేవలను గుర్తిస్తూ పేస్కేల్, 55 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు, అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు, మరణించిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలను చేపడతామని దీనికి సంబంధించిన ఉత్తర్వులను మూడు నెలల్లోగా అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అమలు కాక తీవ్ర మనోవేదనకు గురౌతున్నామన్నామని, వీరిలో కొందరు ఆర్థిక భారంతో మనోవేదనతో ఆత్మహత్యలు చేసుకొన్నారని తెలిపారు. కావున ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసి కోచైర్మన్ పంజాల జనార్ధన్, ప్రధాన కార్యదర్శి బైరుమల్ల సంపత్, ముద్రబోయిన రవికుమార్, కోశాధికారి దర్గుల మధుకర్, వీఆర్ఏలు అడిచెర్ల తిరుపతి, బోగం విష్ణువర్ధన్, కనుమల్ల మల్లయ్య, దార కౌసల్య, నేరెళ్ళ అనేష, గూడెపు కవిత, చర్లపల్లి కవిత, మాదాసు రమ, ఎం.డి సర్వర్, గుత్తికొండ లింగయ్య, గుత్తికొండ సంపత్, చింత కొమురయ్య, పర్లపల్లి కనుకయ్య, పెనుకుల రాజమల్లు, భాషవేణి రాజకొమురయ్య, మీనుగు సదానందంలు పాల్గొన్నారు.



## ఆల్ఫోర్స్ ఈ - టెక్నోలో ఘనంగా ఆజాదికా అమృత్ మహోత్సవ్



**కరీంనగర్ రూరల్, ప్రభాత వార్త:** స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ - టెక్నో స్కూల్‌లో ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి హాజరై దేశ నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం హరితహారం కార్యక్రమం దేశభక్తి గేయాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు భారత దేశ ఔనత్యాన్ని సంరక్షించే విధంగా అకుంటిత దీక్షతో పాటుపడి దేశ గొప్పతనాన్ని రెట్టింపు చేసే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు భారత మతాకి జై, మహాత్మ గాంధీకి జై, జై జవాన్, జై కిసాన్ నినాదాలు చేసి ఉత్సాహాన్ని నింపి భారతదేశానికి జై కొట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

**మంథని - ప్రభాతవార్త:** మంథని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించటం పట్ల జిల్లా విదా ్యశాఖ అధికారి ద్వార బుధవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని మండల విద్యాధికారి దాసరి లక్ష్మి తెలిపారు. మంథని పట్టణంలోని ఆర్‌సి కట్ట ప్రభుత్వ పాఠశాలలో విదులు నిర్వహిస్తున్న బి.కిషోర్ అనే ఉపాధ్యాయుడు తాను పాఠశాల సందర్శనకు వెళ్లటా ఆలస్యంగా రావటంతో పాటు డిప్యూటేషన్ ఉత్తర్వులనను పాటించకపోవటంతో ఆయనకు ఒకరోజు వేతనం నిలిపివేస్తూ షోకాజు నోటీసులు జారీచేసినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ఇదే పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు భైరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాఠశాలకు సంబంధించిన మధ్యాహ్నం భోజనం రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవటంతో పాటు తక్కువ విద్యార్థులు ఉన్నను ఎక్కువ విద్యార్థులు ఉన్నట్లుగా రికార్డులు రాయటంతో పాటు ఇతర రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేకపోవటంతో పాటు విధుల పట్ల నిర్లక్ష ్యంగా వ్యవహరించినందున అతనికి కూడ జిల్లా విద్యాశాఖ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో తొలిమెట్టు కార్యక్రమం ప్రారంభం అవుతున ్న నేపథ్యంలో ఉపాధా ్యయులందరూ సమయపాలన కచ్చితంగా పాటిం చాలని విధుల పట్ల నిర్లక్ష ్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## కోర్టు ఆవరణలో ఇండోర్ గేమ్స్ ప్రారంభించిన జడ్జి ప్రతీక్ సిహాగ్

**వేములవాడ, ప్రభాతవార్త :** అజాదికా అమృత్ మహోత్సవాలలో భాగంగా వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో బుధవారం ఇండోర్ గేమ్స్‌ని జడ్జి ప్రతీక్ సిహాగ్ ప్రారంభించారు. అనంతరం అడ్వకేట్‌లతో కలిసి జడ్జి చెస్, క్యారం ఆడారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ గుడిసె సదానందం, బార్ అసోసియేసన్ ఉపాధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, కోర్టు కానిస్టేబుల్‌లు, సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# అల్ఫోర్స్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ





**కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త:** అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆద్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీని నగరంలో ఘనంగా నిర్వహించారు. వావిలాపల్లి అల్ఫోర్స్ జెన్‌నెక్స్ట్ స్కూల్ నుంచి తెలంగాణ చౌక్ వరకు విధ్యార్థులు, ఉపాధ్యాయులంతా జాతీయ జెండాలు చేతబూని ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశం పలు సంస్కృతీ సాంప్రదాయాలకు నిలయమని, విభిన్న జాతులకు, అన్నిమతాలకు సమానంగా ధర్మం పాటిస్తుందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారతదేశం ఒకటన్నారు. ప్రతి పౌరుడు దేశం కల్పించిన స్వాతంత్ర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ప్రతి పౌరుడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను మరిచిపోకుండా జాతీయ భావాన్ని పెంపొందించేవిదంగా తిరంగా ర్యాలీని సుమారు 2 వేల మంది విధ్యార్థులతో నిర్వహించినట్లు తెలిపారు. గత 75 సంవత్సరాలుగా భారతదేశం వివిధ రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో భారతదేశం వ్యవహరించిన తీరు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిందన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ఆజాదీకా అమృత్ మహోత్సవ్, స్వాతంత్ర్య భారత వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఆయన దన్యవాదాలు తెలియజేశారు. దేశం కోసం పోరాడుతున్న జవాన్లకు, వారి కుటుంబాలకు ప్రత్యేకంగా వందనాలు తెలిపారు. ఈ సంధర్భంగా విధ్యార్థులు వివిధ సాంస్కృతిక చేసిన కార్యక్రమాలు అలరించాయి. ఈ వేడుకల్లో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ ప్రిన్సిపాల్స్, బోధనా సిబ్బంది, తల్లిదండ్రులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

# స్వతంత్ర భారత వజ్రోత్సవాలు

**కోరుట్ల, ప్రభాతవార్త:** స్వతంత్ర భారత వజ్రోత్సవాలు, అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పట్టణంలోని మాదాపూర్ కాలనీలోని "ఫ్రీడం ఫార్క్"లో మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య బుధవారం ప్రారంభించారు. వజ్రోత్సవాల్లో భాగంగా 75సంఖ్య గుర్తులో 75మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 75వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడం మన అందరి అదృష్టమని, ప్రతి ఒక్కరు ఈ వజ్రోత్సవాల్లో పాల్గొని తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. అనంతరం పట్టణంలోని అన్ని వార్డుల్లో ఆయా వార్డుల కౌన్సిలర్ల చేతుల మీదుగా ఇంటికో జాతీయ పతక పంపిణీ కార్యక్రమం చేపట్టారను. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎండి.అయాజ్, వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంబేరి నాగభూషణ ం, రుద్ర సుజాతశ్రీనివాస్, ముజఫర్ అహ్మద్, గంధం గంగాధర్, జిందం లక్ష్మీనారాయణ, మాడవేని నరేష్, పెండెం గణేష్, సంగ మాలతిలింగం, బలిజ పద్మరాజరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ అభినయ్, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ లక్ష్మి, టీపీఎస్ రమ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**మండలంలో...: కోరుట్ల రూరల్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుల దేశాల మేరకు



మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఆయా గ్రామాల్లో జాతీయ జెండాలను పంపిణి చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, పీఎసీఎస్ చైర్మెన్లు, కార్యదర్శులు, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిత్య జనగణనకు ఐదేళ్లు.. స్వతంత్ర్య వజ్రోత్సవానికి ఆదర్శం

- కొలనూర్‌లో నిత్యజనగణన - జాతీయ జెండాకు నిత్యం వందనం
- ముందే ప్రారంభమైనా వజ్రోత్సవాలు

**కోనరావుపేట,ప్రభాతవార్త:** నిత్యజనగణనకు ఐదేళ్లు పూర్తి చేసుకోని ఆయా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది. 75 ఏళ్ల స్వతంత్ర్యం పూర్తి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ జెండా పండుగాను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రతి ఇంటి మీద జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తిని చాటేలా చర్యలు తీసుకుంది. కానీ గత ఐదేళ్ల కిందటే ఓ గ్రామంలో నిత్యం జనగణన కార్యక్రమం చేపట్టింది.ప్రతి రోజు ఉదయం 8 గంటలకు గ్రామ పంచాయతీ మైక్ ద్వారా జాతీయ గీతం ప్రచారం చేయడంతో స్థానికులు ఏ పని మీదు ఉన్నప్పటికి వందనం చేయాల్సిందే. ప్రతి ఒక్కరిని అలర్ట్ చేసేందుకు దేశభక్తి గీతాలను ప్రచారం చేస్తుంది. ప్రతి రోజు ఇలా జాతీయ గీతంకు గౌరవించి, గ్రామంలోని ప్రతి ఒక్కరూ దేశభక్తి చాటుకోని పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామంలో నిత్యజనగణ కార్యక్రమం నిత్యం జరుగుతుంది. గ్రామంలో నిత్య జనగణను చేపట్టాలని 2017 డిసెంబర్‌లో అప్పటి సర్పంచ్ రశీద్ అన్ని కుల సంఘాలతో సమావేశం నిర్వహించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. జనవరి 1న 2018లో అప్పటి కలెక్టర్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో నిత్యజనగణనకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యజనగణన జరుగుతుంది. గత ఐదేళ్లుగా గ్రామంలో నిత్యజనగణన నిర్వహిస్తూ స్వతంత్ర్య వజ్రోత్సవ వేడుకలను ప్రారంభించామని స్థానికులు చెబుతున్నారు.





## స్వతంత్ర ఉద్యమాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిది

- పెద్దపల్లి డిసిపి రూపేష్



**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** స్వతంత్ర ఉద్యమాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిదని పెద్దపల్లి డిసిపి రూపేష్ అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా డిసిపి రూపేష్, గోదావరిఖని ఎసిపి గిరి ప్రసాద్, వన్‌టౌన్ సిఐలు రమేష్‌బాబు గాంధీనగర్‌లోని పోలీస్ గెస్ట్‌హౌస్ ఆవరణలో స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 75 మొక్కలను బుధవారం నాటారు. ఈ సందర్భంగా డిసిపి రూపేష్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ఎందరో మహానుభావులు కష్ట, నష్టాలకు ఓర్చి వారి విలువైన జీవితాలను త్యాగం చేసిన మహానీయులను స్మరిస్తూ ఈ సారి వేడుకలను రెండువారాల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 6.30గంటలకు జరిగే ఫ్రీడర్ రన్ కార్యక్రమం రామగుండం మున్సిపాలిటీ నుంచి ప్రధాన గాంధీ చౌరస్తా వరకు నిర్వహించబడుతుందని, విద్యార్థులు, వ్యాపార సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగులు, అధికారులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్, స్వామి, సుబ్బా రావు, ఎఎస్ఐ మల్లయ్య, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## స్వాతంత్రోద్యమ చరిత్రను భావితరాలకు అందించాలనే సంకల్పంతో వజ్రోత్సవాలకు శ్రీకారం

- తెరాసా జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, ప్రభాతవార్త:** స్వాతంత్రోద్యమ చరిత్రను భావితరాలకు అందించాలనే సంకల్పంతో వజ్రోత్సవాలకు శ్రీకారం చట్టడం జరిగిందని తెరాసా జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్ఎఫ్‌సిఎల్ ప్రాంగణంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించి ఫ్రీడం పార్కు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మ గాంధీ పోరాట స్ఫూర్తి, స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న మహానుభావుల త్యాగాల గురించి తెలుసుకొని దేశ భక్తి భావన ప్రతీ ఒక్కరిలో రగిలించాలనే సదుద్దేశ్యంతో ఇంటింటి జెండా ఎగురవేయడం మొదలు కొని 15 రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫ్రీడం పార్కు కోసం కేటాయించిన స్థలంలో ఎమ్మెల్యే, మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కుమార్ దీపక్ తదితరులు మొక్కలు నాటారు. వజ్రోత్సవాలకు చిహ్నంగా 75 సంఖ్యను ప్రదర్శిస్తూ ఫ్రీడం పార్కులో నాటిన మొక్కలు ఆకర్షణీయంగా నిలిచాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు కల్వచర్ల క్రిష్ణవేణి, జనగామ కవితా సరోజిని, సాగంటి శంకర్, అడ్డాల స్వరూపా రామస్వామి, బాలరాజ్‌కుమార్, నాయకులు పాతపల్లి ఎల్లయ్య, గడ్డి కనకయ్య, ఆర్ఎఫ్‌సిఎల్ అధికారులు సోమనాథ్, మయాంక్ దబాన్, నగర పాలక సంస్థ అధికారులు చిన్నారావు, యాదగిరి, రవి కుమార్, తేజశ్విని, మనోహర్, శంకర్ రావు, కరుణాకర్, హరితహారం అధికారి అర్జున్, మెప్మా డిఎంసి రజనీ, సిఓలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గోపీ క్రిష్ణ, లింగయ్య, ఆంజనేయులు, సూపర్ వైజర్లు విజయ్, సారయ్య, పలువురు స్వశక్తి మహిళలున్నారు.

# చేతులెత్తేసిన కాంట్రాక్టర్... సొంత ఖర్చులతో రోడ్డు బాగు చేయించిన సర్పంచ్

ఎల్లారెడ్డిపేట, ప్రభాతవార్త :

రోడ్డు నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో తన స్వంత ఖర్చులతో సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి రోడ్డు పనులు పూర్తి చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ పంతం రామచంద్రం బొప్పాపూర్ గ్రామంలో 50 లక్షల రూపాయలతో ఎస్సీ కాలనీ వద్ద బ్రిడ్జి మరియు సిసి రోడ్డు పనుల కాంట్రాక్టు పట్టుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం అర్ధాంతరంగా నిలిపివేశారు. రోడ్డును కూడా సరిచేయకుండా మధ్యలోనే వదిలేసి సర్పంచ్, గ్రామస్తులు ఎన్నిసార్లు ఫోన్ చేసి చెప్పినా వచ్చింది లేదు పట్టించుకుంది లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డులో గుంత ఏర్పడగా, కాంట్రాక్టర్ రామచంద్రం అందులో నాసిరకం మట్టి పోయించి చేతులు దులుపుకున్నాడని ఆరోపించారు. బొప్పాపూర్ గ్రామం నుండి గంభీరావుపేట, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, బొప్పాపూర్ గ్రామస్తులు రైతులు ఇదే రోడ్డు వెంబడి వెళ్లాల్సి ఉంది. బస్సులు, ఆటోలు, బైకులు మట్టిలో దిగబడుతున్నాయి. కాంట్రాక్టర్‌కు, ఆర్అండ్‌బి వారికి ఫోన్ చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు ఇట్టి సమస్యను వివరించగా స్పందించిన సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి గ్రామస్తులకు, స్కూల్‌కు వెళ్లే పిల్లలకు, రైతులకు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని, కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తన స్వంత ఖర్చుతో జేసీబీ, ట్రాక్టర్ సాయంతో రోడ్డును బాగు చేయిస్తున్నారు. అలాగే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల జరగరానిది ఏమైనా జరిగితే అది ఎవరి బాధ్యత అని కాంట్రాక్టర్ యొక్క బిల్లును నిలిపివేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, కనీసం ఆర్అండ్‌బి అధికారులకు ఫోన్ చేస్తే స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కాంట్రాక్టర్, ఆర్అండ్‌బి వారు కుమ్మక్కయ్యారని అందుకే ఎవరూ స్పందించడం లేదని గ్రామ సర్పంచ్ బాల్‌రెడ్డి తెలిపారు.



# మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటిన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

**- 13, 14, 15 తేదీల్లో ప్రతిఒక్కరూ తమ ఇండ్లపై జాతీయ జెండా ఎగురవేయాలి**

**- ఎంపీపీ పడగల మానస**

తంగళపల్లి, ప్రభాతవార్త :

75వ స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని వన మహోత్సవంలో భాగంగా తంగళపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఎంపీపీ పడగల మానసలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగానే భారత స్వాతంత్ర్యం రావడం జరిగిందని తెలిపారు. 13, 14, 15తేదీల్లో ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయాలని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ అమరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. అలాగే గురువారం ఉదయం 6.30 ని.లకు తాడూరు చౌరస్తా నుండి తంగళపల్లి పద్మనగర్ వరకు 2కే రన్ నిర్వహించబడుతుందని, ఇందులో మండల ప్రజలు భాగస్వాములు కావాలని ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఎంపీపీ పడగల మానసలు కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో మదన్మోహన్, ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఎంపిడివో లచ్చాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతి, వేణుగోపాల్‌పూర్ సర్పంచ్ కాయితి బాలయ్య, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, ఎంపిటిసిలు బైరినేని రాము, బుస్స స్వప్న, మీసాల కల, నాయకులు కందుకూరి రామాగౌడ్, సిద్దన్న, లక్ష్మారెడ్డి, జగత్, బండి జగన్, నూలుగొండ శ్రీనివాస్, రెడ్డి పర్శరాములు, టిఆర్ఎస్ మహిళా నాయకురాలు మోర నిర్మల, మండల పరిత్ అధికారులు పాల్గొన్నారు.



# గాంధీజీ దేశం కోసం చేసిన సేవలను త్యాగాలను నేటి తరానికి చాటి చెప్పాలి

**- ఎంపీపీ జనగామ శరత్‌రావు**

ముస్తాబాద్, ప్రభాతవార్త :

డెబ్బై అయిదవ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవంలో భాగంగా మండలంలోని మద్దికుంట గ్రామంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు ఆధ్వర్యంలో పల్లె ప్రకృతివనంలో 75వ ఆకృతిలో చెట్లను నాటిన అనంతరం అక్కడికి విచ్చేసిన ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాలతోనే ఈ దేశం ఏర్పాటు జరిగిందన్నారు. భారతదేశం ఏర్పడి 75 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా దేశం ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన వారి గురించి ముఖ్యంగా గాంధీజి అనుసరించిన విధానాలను స్వాతంత్ర్య ఉద్యమ త్యాగాలను నేటి తరానికి చాటి చెప్పాలన్నారు. ప్రతిఒక్కరిలో దేశభక్తిని పెంపొందించుటకే ఈ వజ్రోత్సవ వేడుకలు నిర్వహిసు_్తన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇంటింటికి జాతీయ జెండాను మండల వ్యాప్తంగా పంపించేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే మండలంలోని ప్రతి గ్రామంలో సర్పంచ్, ఎంపిటిసి, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయని తెలుపుటకు సంతోషిస్తూ ప్రతిఒక్కరూ ఈ వజ్రోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో నీర్ల రమాదేవి, స్థానిక ప్రజాప్రతినిధులు, పలు విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నేడు నిర్వహించనున్న 2కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ధర్మపురి, ప్రభాతవార్త :

భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా ధర్మపురిలో గురువారం ఉదయం నిర్వహించనున్న 2కే రన్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని స్థానిక సిఐ కోటేశ్వర్, తహసీల్దార్ వెంకటేష్‌లు కోరారు. ధర్మపురి పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం వివిధ శాఖల అధికారులతో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో వివిధ శాఖల సహకారంతో ధర్మపురిలో భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా 2కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6.30ని.లకు నంది విగ్రహం వద్ద 2కే రన్ ప్రారంభమవుతుందని, నంది విగ్రహం నుండి గాంధీ విగ్రహం, సర్దార్ వల్లాభాయ్ పటేల్ విగ్రహం స్వామి వివేకానంద, అంబేద్కర్ విగ్రహాల మీదుగా తిరిగి నంది విగ్రహం వరకు చేరుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ కార్యక్రమానికి హాజరై తమ దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు బత్తిని అరుణ, ఎంపిడివో ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రమేష్, ఎంఈవో భూమయ్య, ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు

రుద్రంగి, ప్రభాతవార్త :

75వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు రుద్రంగి మండల కేంద్రంలో పల్లె



ప్రకృతి వనంలో ఎంపీపీ గంగం స్వరూప మహేష్, జడ్పిటిసి గట్ల మీనయ్య, సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్‌లు బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా పల్లె ప్రకృతివనంలో 75 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శంకర్ నాయక్, ఎంపివో సుధాకర్, నాయకులు మనోహర్, లచ్చిరెడ్డి, గణేష్, మోహన్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బృహత్ పల్లె ప్రకృతివనంలో స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలు

తంగళపల్లి, ప్రభాతవార్త :

తంగళపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామ సర్పంచ్ మాట్ల మధు ఆధ్వర్యంలో బృహత్ పల్లె ప్రకృతి వనంలో 75వ స్వాతంత్ర్య భారత



వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకొని వనం మహోత్సవంలో భాగంగా 75 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు, ఐక్యతను చాటడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ 15 రోజుల పాటు స్వతంత్ర భారత వజ్రోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సతీష్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ రవీందర్, పూర్ణ, ప్రభాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద యువతికి లగిశెట్టి పుస్తె మట్టెలు అందజేత

తంగళపల్లి, ప్రభాతవార్త :

తంగళపల్లి మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో చిట్యాల కమలవ్వ-కీ.శే. నర్సయ్య కుమార్తె భవానికి లగిశెట్టి శ్రీనివాస్ పద్మశాలి పుస్తె, మట్టెలు, పెండ్లి చీరె అందజేశారు. ఈ సందర్భంగా లగిశెట్టి మాట్లాడుతూ వీరి వైవాహిక జీవితం సాఫీగా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆ సంతోషీమాత అమ్మవారి కృప వీరికి ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వధువు కుటుంబ సభ్యులు శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో ఫ్యాక్స్ వైస్ చైర్మన్ బొంగరం శ్రీనివాస్‌రెడ్డి, బొంగరం జనార్దన్‌రెడ్డి, సురేష్, సంజీవ్, కుమార్, భాస్కర్, పద్మశాలి ట్రస్టు సభ్యులు సిరిసిల్ల రాజేశం, రాము, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మల్యాలలో వజ్రోత్సవాల ఫ్రీడం పార్క్ ఏర్పాటు

మల్యాల, ప్రభాత వార్త:

భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా బుధవారం మల్యాల



గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఫ్రీడం పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు సమీపంలో 75 ఆకారంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి భారీ ఎత్తున మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, తహశీల్దార్ సుజాత, పంచాయితీ ఈవో గుండేటి రవీందర్, ఏఎంసి ఉపాధ్యక్షులు ఆసం శివ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మల్యాలలో స్వాతంత్ర్య వార్షికోత్సవాలలో భాగంగా ప్రతి ఇంటిలో జెండా ఎగురవేయాడానికి గాను జాతీయ పథకాలను వార్డుల వారీగా అందజేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఈవో తెలిపారు.

## మల్యాలలో విద్యుత్ సిబ్బంది విస్తృత తనిఖీలు

మల్యాల, ప్రభాత వార్త:

మల్యాల మండల కేంద్రంలో బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రతి ఇంటి విద్యుత్ కనెక్షన్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సెక్షన్ల పరిధిలోని విద్యుత్ ఏఈలు, లైన్‌మెన్‌లు సిబ్బంది బృందాలుగా ఏర్పడి పోల్ టు పోల్ వారిగా ఉన్న విద్యుత్ కనెక్షన్ల లోడు వినియోగం తదితర వివరాలను సేకరించి, వినియోగదారులు పొందిన కేటగిరికి సంబంధించిన కనెక్షన్ వివరాలను నమోదు చేసుకున్నారు. మల్యాలలో విద్యుత్ సరఫరాలో లాస్‌పై అధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.

## కొత్తపల్లి సబ్ స్టేషన్‌లో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు

జమ్మికుంట, ప్రభాత వార్త:

జమ్మికుంట పట్టణంలోని 18వ వార్డులో సిఎం కేసీఆర్ చేపట్టిన



స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల కార్యక్రమంలో కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేసన్‌లో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటే కార్యక్రమంలో హుజురాబాద్ ఎలక్ట్రికల్ డిఈఈ విజేందర్ రెడ్డి, ఏఈ జి. రమేష్, వార్డు కౌన్సిలర్లు బొద్దుల అరుణ, జుగురు సదానందం, పాతకాల రమేష్, సింగిల్ విండో అధ్యక్షులు పొనగంటి సంపత్, మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్, మాజీ ఎంపిటిసి దేశిని సదానందం, పుర ప్రముఖులు, మున్సిపల్ కమీషనర్ సమ్మయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు వజ్రోత్సవాల్లో పాల్గొనాలి

**-- జమ్మికుంట జడ్‌పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యాం**

జమ్మికుంట, ప్రభాత వార్త:

ప్రతి ఒక్కరు వజ్రోత్సవాల్లో పాల్గొనాలని జమ్మికుంట జడ్‌పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యాం పిలుపునిచ్చారు. జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఫ్రీడం పార్క్ ఏర్పాటు చేశారు. ఈ



కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జమ్మికుంట ఎంపిపి దొడ్డే మమత, జడ్‌పిటిసి జడ్‌పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యాం లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.... 75వ సంవత్సరాల స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సిఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం ఫ్రీడం పార్కులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా 750 మొక్కలను నాటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రోజు గ్రామంలో ఉన్న ప్రజలు వజ్రోత్సవాలలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపిడివో సతీష్ కుమార్, జగ్గయ్యపల్లి సర్పంచ్ వంశీధర్ రావు, ఉప సర్పంచ్ నిమ్మల హైమ శంకర్, వార్డు సభ్యులు నీల మహేందర్, శ్రీకాంత్, రవీందర్, రాజు, కుమారస్వామి, రవి, రాజశేఖర్, సుమలత, రజిత తదితర అధిదకారులు పాల్గొన్నారు.

## నూకపల్లి వద్ద మహిళను వెంబడించి చైన్ స్నాచింగ్

మల్యాల, ప్రభాత వార్త:

కరీంనగర్ - జగిత్యాల ప్రధాన మార్గంలోని మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో గల నూకపల్లిలో ఓ ప్రైవేటు స్కూల్ సమీపంలో బుధవారం సాయంత్రం స్కూటిపై వెళ్తున్న మహిళను వెంబడించి చైన్ స్నాచింగ్ కు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన శరణ్య వివాహిత జగిత్యాలలో ఓపెన్ డిగ్రీ పరీక్షలకు హాజరై తిరిగి వస్తుండగా నూకపల్లి సమీపంలో బైక్‌పై వచ్చిన ఆగంతకులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ సంఘటనలో స్కూటీపై వెళ్తున్న శరణ్య మెడలోని పుస్తెలతాడుతో పాటు బంగారు గొలుసును ఆగంతకులు లాక్కెళ్ళగా స్కూటీ అదుపుతప్పి పక్కన పంట పొలాల్లో పడిపోయింది. ఈ సంఘటనలో శరణ్య కాలుకు తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మల్యాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మడిపల్లిలో ఘనంగా పీర్ల పండుగ వేడుకలు

జమ్మికుంట రూరల్, ప్రభాత వార్త:

జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో కుల, మతాలకు అతీతంగా పీర్ల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పీర్ల పండుగ వేడుకలలో గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కార్మిక విభాగం మండల అధ్యక్షులు ఒల్లాల సాంబయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరు ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటుకోవాలి

**-- 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేష్**

జమ్మికుంట రూరల్, ప్రభాత వార్త:

ప్రతి ఒక్కరు వారి ఇంటిపై జాతీయ జెండాలు ఎగరవేసి దేశభక్తిని చాటుకోవాలని 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేష్ అన్నారు. సోమవారం



జమ్మికుంట పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో సిఎం కేసీఆర్ చేపట్టిన స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా 6వ వార్డులో ప్రతి ఇంటికి జాతీయ జెండాను పాదరక్షలు లేకుండా కాలినడకన ప్రతి ఇంటికి తిరుగుతూ జాతీయ జెండాను అందజేస్తూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఉండాలని వార్డు ప్రజలకు తెలియజేస్తూ దేశ భక్తిని చాటుకోవాలని ప్రతి పౌరుడుని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీపతి నరేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్కాపూర్‌లో స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలు

కరీంనగర్ రూరల్, ప్రభాత వార్త:

కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలలో భాగంగా బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమా ఆగర్వాల్




మొక్కలను నాటారు. మల్కాపూర్ గ్రామంలో మొత్తం 7500 మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం మొదట 2800 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి యల్. శ్రీలత, కొత్తపల్లి ఎంపిడివో శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ గొట్టె జ్యోతి, మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు పండుగ గంగమ్మ, గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధీ హామీ పథకం సిబ్బంది, ఎస్‌హెచ్‌జి సభ్యులు, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

**సర్పంచ్ ఉప్పుల శ్రీధర్**

కరీంనగర్ రూరల్, ప్రభాత వార్త:

గ్రామంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని నగునూర్ గ్రామ సర్పంచ్ ఉప్పుల శ్రీధర్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలో అందరికి ఇంటింటికి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పుల శ్రీధర్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు కార్యక్రమం గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాస్, వార్డు సభ్యులు, అంగాన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## జాతీయ పతాకం ఏర్పాటుకు భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు

జమ్మికుంట, ప్రభాత వార్త:

స్థానిక జమ్మికుంట గాంధీ చౌరస్తాలో నిత్యం 365 రోజులు జాతీయ జెండా ఎగిరేలా జాతీయ పతకాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, కమీషనర్ సమ్మయ్య, ఎస్ఐ యూనిస్ అహ్మద్, సిఐ రామచందర్ రావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఫ్రీడమ్ పార్క్‌లను ప్రారంభించిన జిల్లా ఎస్పీ



**ఆదిలాబాద్, ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా 75వ స్వతంత్ర వజ్రోత్సవాలు పురస్కరించుకొని ఆగస్టు 10వ మహోత్సవంలో భాగంగా రాష్ట్ర డీజీపీ ఎం. మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆదిలాబాద్ జిల్లాలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి. ఉదయ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్రీడం పార్క్‌లను ప్రారంభించారు. ఈ ఫ్రీడమ్ పార్క్‌లో 75 మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. ఈ వజ్రోత్సవాలను ఆగస్టు 8 నుంచి 22వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వాతంత్రం సిద్ధించడానికి ఎందరో మంది మహనీయుల ప్రాణత్యాగం, ఎందరో మంది వ్యక్తుల మంది సేవలు భావితరాల యువతకు ప్రజలకు తెలియజేయడానికి ఈ వజ్రోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 6గంటలకు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఫ్రీడం రన్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ శ్రీనివాస్‌రావు, డీఎస్పీలు ఉమేందర్, ఎం. విజయ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ జె. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీసుల ఆధ్వర్యంలో 2కే ఫ్రీడమ్ రన్

**సిరికొండ, ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా 75వ స్వతంత్ర వజ్రోత్సవాలు పురస్కరించుకొని ఈనెల 11న ఉదయం 6గంటలకు సిరికొండ పోలీసుల ఆధ్వర్యంలో 2కే ఫ్రీడమ్ రన్ నిర్వహిస్తున్నట్టు ఎస్సై నిరేశ్ తెలిపారు. 2కే రన్ గాంధీ చౌక్ నుంచి భారత్ పెట్రోల్ బంక్ వరకు కొనసాగుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, యువత, యువకులు, విద్యార్థులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## భారత వజ్రోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**- మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ద్యాగల గంగారాణి**

**బోథ్, ప్రభాతవార్త**

భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ఈనెల 8 నుంచి 22 వరకు నిర్వహించే స్వతంత్ర వజ్రోత్సవాలు రోజువారి కార్యక్రమంలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా గ్రామ సంఘాల అధ్యక్షులు స్వయం సహాయక సభ్యులు వినోఏలు, సీసీలు, ఐకేపీ సిబ్బంది అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం బోథ్ మండలంలోని కరత్వాడ గ్రామంలో ఫ్రీడం పార్క్ ఏర్పాటు చేసి అందులో 75 మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో మంది మహానుభావులు అమరవీరుల త్యాగాల ఫలితంగా స్వతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ప్రతి స్వయం సహాయక సంఘంలోని సభ్యురాలు ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్లపైన జాతీయ జెండాను ఎగరేసి భారత జాతీయ జెండా రెపరెపలాడిలా జాతీయ ఐక్యతను చాటాలన్నారు. ఈకార్యక్రమంలో స్వయం సహాయక సంఘం సభ్యులు పంచాయతీ సెక్రటరీ, ఐకేపీ సీసీఎం గంగాధర్, సీబీఓ గంగాధర్, వీఓఏ చిన్నయ పాల్గొన్నారు.

## ఫ్రీడమ్ పార్క్‌ను ప్రారంభించిన ఎంపీపీ

**జైనథ్, ప్రభాతవార్త**

మండలంలోని గిమ్మ, కోర్ట గ్రామాల్లో బుధవారం భారత స్వాతంత్ర వజ్రోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అధ్యక్షులు మారిశెట్టి గోవర్దన్ ఫ్రీడమ్ పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించడానికి ఎందరో మంది మహనీయుల ప్రాణత్యాగం, ఎందరో మంది వ్యక్తుల మంది సేవలు భావితరాల యువతకు ప్రజలకు తెలియజేయడానికి ఈ వజ్రోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి, చంద్రయ్య, ఎంపీడీఓ గజానన్, ఎంపీఓ వెంకటరాజు, ఏపీఓ మేఘమాల, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులు

**నేరడిగొండ, ప్రభాతవార్త**

స్వాతంత్ర వజ్రోత్సవాల భాగంగా నేరడిగొండ మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో 75 మొక్కలు నాటడం జరిగింది. అంతేకాకుండా అర్బన్ పార్క్, బోథ్ ఎక్స్‌రోడ్ వద్ద 7500 మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీపీ మహేందర్‌రెడ్డి, ఎఫ్‌డీఓ, ఇచ్చోడ ఎమ్మార్వో పవన్ చంద్ర, ఫారెస్ట్ రేంజ్ అధికారి గణేష్, ఎస్సై మహేందర్, ఎంపీడీఓ శోభన, ఎఫ్‌బీఓ బీమ్జినాయక్ పాల్గొన్నారు.



## ఇంటింటికి జాతీయ జెండా పంపిణీ

**బోథ్, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న తరణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో ఇంటికో జాతీయ జెండాలను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక సర్పంచ్ బండారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ జెండాలను ఎగురేస్తూ పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం జెండాను ఎలా ఎగరవేయాలో అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈనెల 14లోగా రైతుభీమా చేసుకోవాలి

**- ఏఈఓ యువరాణి**

**కాగజ్‌నగర్‌రూరల్, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభీమా నమోదుకు ఈనెల 14లోపు వరకు గడువు పొగడించినట్లు ఏఈఓ యువరాణి తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన వారికి ఈ పథకం వర్తిస్తుందని అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో సంప్రదించాలని కోరారు. అర్హులైన ఉండి ఇప్పటి వరకు పేర్లను నమోదు చేసుకోని రైతుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డుపై పెట్టినట్లు ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గడును పెంచినందున అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



## బాధిత కుటుంబాలకు పరామర్శ

**ఆదిలాబాద్, ప్రభాతవార్త**

తలమడుగు మండలంలోని అర్లి గ్రామానికి చెందిన కంది బాపన్న గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడ. అలాగే భరంపూర్ గ్రామానికి చెందిన సుల్తాన్ గత వారం రోజుల క్రితం మరణించడంతో బుధవారం బాధిత కుటుంబాలను టీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్ పరామర్శించారు. అనంతరం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈవిషయాన్ని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈయన వెం రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గోక జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, జిల్ల నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, టీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు అబ్దుల్లా, సర్పంచ్ కిష్టన్న, ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మగ్గిడి ప్రకాష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆయా గ్రామ కమిటీ అధ్యక్షులు ఆనంద్, వినోద్, నాయకులు గజానన్, స్వామి, ప్రభాకర్, శాస్త్రీ, ఎల్లయ్య, నానబాపు పాల్గొన్నారు.



## పుస్తకాల పంపిణీ

**సిరికొండ, ప్రభాతవార్త**

మండలంలోని సాత్‌మురి గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మునేశ్వర్ విజయ్‌కుమార్ సహా ఉపాధ్యాయులు ఆనంద్‌రావు తమ సొంత డబ్బులతో పిల్లలకు బెల్ట్ టై, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పటేల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బాలుడిపై కోతి దాడి

**నేరడిగొండ, ప్రభాతవార్త**

మండలంలోని కుప్టి గ్రామంలో సాయి నాత్రమత్(6)బాలుడు ఆడుకుంటుండగా కోతి దాడి చేసింది. దీంతో చేతులకు గాయాలయ్యాయి. అంతేకాకుండా పంటలనే కాకుండా మనుషులపైన కూడా కోతలు దాడి చేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇండ్లలో చొరబడి తినుబండారాలను కూడా ధ్వంసం చేస్తున్నాయని, పిల్లలమీద పడి కరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతల బెడదను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.







# వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

### ★ జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివిధశాఖల ఉద్యోగులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయాశాఖల పరిధిలో వజ్రోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేడుకలు విజయవంతం అయ్యే విధంగా ప్రతీ ఒక్క అధికారులు శ్రద్ధతో జరిపే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషర్ అంజయ్య, తహసీల్దార్ ప్రమోద్‌కుమార్, ఎంపిడిఓ శ్రీనివాస్, కోఆర్డినేటర్ దత్తాత్రేయ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాగజ్‌నగర్ డిఎస్పి కరుణాకర్, టౌన్ సీఐ రవీందర్, ఎస్ఐలు సాగర్, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### ఆజాదీకా అమృత్ మహోత్సవం..

లక్ష్మణచందా, ప్రభాతవార్త

ఘర్ ఘర్ తిరంగ పంపిణి కార్యక్రమం లక్ష్మణచందా మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల్ నియోజకవర్గ భాజపా నాయులు కాలగిరి మల్లికార్జున్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఆగస్టు 13 నుండి ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని పార్టీలతో సంబంధం లేకుండా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు మరియు లక్ష్మణ చందా మండల ఇంచార్జి కమల్‌నయన్, మండల అధ్యక్షుడు అనిల్, మండల ప్రధాన కార్యదర్శి విఠల్, మహిళా మోర్చా నాయకురాలు రజిత, బీజేవైఎం నాయకుడు , రాష్ట్ర కార్యదర్శి సభ్యులు అనుముల శ్రావన్‌కుమార్, మురళీ , నారాయణ, దేవేందర్, గణేష్, రాజేశ్వర్‌రెడ్డి, లింగన్న, సదాశివ, భాస్కర్, సుంకరి రాజేశ్వర్, నూకల మల్లేష్, శేఖర్‌మేడిపెల్లి, సంతోష్, నిత్యానందం, నరేష్, ముత్తన్న, మదా హరీష్, రాజేశ్వర్, భాజపా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



### ఇంటింటికి జాతీయ జెండాల పంపిణీ..

దహెగాం,ప్రభాతవార్త

మండలంలోని బీబ్రా గ్రామంలో బుధవారం జాతీయ జెండాలను ఇంటింటికి పంపిణి చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా స్వతంత్ర్య వజ్రోత్సవాలను బిబ్రా గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ, పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచన బండల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుమలత, గ్రామ నాయకులు లక్ష్మణ్, గొడిసెల మణికంఠ గౌడ్, రషీద్, రౌతు విఘ్నేష్, మేడి సాయి, దగడ్ సాయి, శ్రీఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఫ్రీడమ్ పార్క్ ప్రారంభం

ఆదిలాబాద్, ప్రభాతవార్త

ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 75వ భారత స్వాతంత్ర వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా వన మహోత్సవ కార్యక్రమం ఫ్రీడమ్ పార్క్‌ను తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణమ్ రాజేశ్వర్, సర్పంచ్ మొట్టె వెంకటమ్మ కిరణ్, స్థానిక బోథ్ నియోజక వర్గ టీఆర్ఎస్ అధికార ప్రతినిది శ్రీ మొట్టే కిరణ్‌కుమార్, అలాగే స్థానిక ఎంపీటీసీ గోదావరి కమలాకర్, ఎంపీడీఓ రమాకాంత్, మండల పంచాయతీ ఆఫీసర్ దిలీప్‌కుమార్, ఫారెస్ట్ అధికారులు, ఉప సర్పంచ్, కాకర్ల ప్రశాంత్, శార్ధ ప్రమోద్ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ మున్న, ఈరన్న, స్వామిరెడ్డి, రాంరెడ్డి, నవీన్ సంతు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రీడమ్ పార్క్‌ను ప్రారంభిస్తున్న నాయకులు



## ప్రజా సంగ్రామయాత్రలో పాయల్ శంకర్

ఆదిలాబాద్, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేపట్టిన పాదయాత్రలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ పాల్గొన్నారు. నకిరేకల్ నియోజక వర్గంలో చిట్యాల మండలంలోని నారేపల్లి గ్రామంలో ప్రజాసంగ్రామ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయ పరిస్థితులను గురించి పాయల శంకర్‌ను బండి సంజయ్ అడిగి తెలుసుకున్నారు. తాజాగా ఎయిర్ పోర్ట్ వివాదం గురించి చర్చించారు. టీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాలను సమర్ధవంతంగా తిప్పికొట్టారన్నారన్నారు.

# నిర్మల్ వార్త



## వీఆర్ఏల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలి : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచందా, ప్రభాతవార్త

డిమాండ్ల సాధన కోసం లక్ష్మణచందా మండల కేంద్రంలో దీక్షలు చేస్తున్న వీఆర్ఏలకు ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటి చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసిఆర్ ప్రభుత్వం మొత్తం రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తునాన్నరని ధ్వజమెత్తారు. అటు వీఆర్ఏను ఆగం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో వీఆర్ఏల న్యాయమైన డిమాండ్‌లను నెరవేరుస్తామని మహేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు.



## మృతుడి కుటుంబానికి జడ్పిటిసి ఆర్ధిక సహాయం

పెంబి,ప్రభాతవార్త

పెంబి మండలం శట్‌పల్లి గ్రామానికి చెందిన రైతు తోట గంగరాజం పంట కొట్టుకుపోయిందని తీవ్ర మనస్థాపానికి చెందిన అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి బీజేపి ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, పెంబి జడ్పిటిసి జానకి రమేష్ మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా దుకోవాలని రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట బీజేపి మండల అధ్యక్షుడు తులాల సదాశివ్, భీంరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

**- డీసిసి అధ్యక్షుడు రామారావు పటేల్**

ముధోల్,ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని డిసిసి అధ్యక్షుడు రామారాలు పటేల్ అన్నారు. బుధవారం ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా బాసర నుండి చేపట్టిన యాత్ర ముధోల్ మీదుగా కొనసాగింది. జాతిపిత మహాత్మ గాంధీ, చాకలి ఐలమ్మ, మహాత్మ జ్యోతిబాపులే, సర్దార్ పాపన్నగౌడ్, రాజ్యంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్య ఉద్యమంలో ఆత్మ బదిదానాలు చేసుకున్న మహనీయులను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. మహనీయుల త్యాగాలను వృధా కానివద్దని అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ దేశ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందని వెల్లడించారు. మహనీయులు చూపిన బాటలో ముందుకళ్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏంఎపి మాజి చైర్మన్ ఆనంద్‌రావు పాటిల్, ముధోల్ మండల అధ్యక్షుడు టి. రమేష్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు బిద్దుర్ రమేష్, అసెంబ్లీ అధ్యక్షుడు సాయినాథ్, స్థానిక నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల వార్త

# పోస్టల్ శాఖలో అందుబాటులో జాతీయ జెండా..

☆ ఇంటింటా జాతీయ జెండా విజయవంతం చేయాలి ☆ పోస్టల్ శాఖ ఉమ్మడి జిల్లా ఎస్పి కేబిఆర్ ప్రసాద్





జైనూర్,ప్రభాతవార్త

ప్రభుత్వం ఇంటింటా జెండా కార్యక్రమం నిర్వహిస్తుందని, స్వాతంత్ర వజ్రోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పోస్టల్ శాఖ ఉమ్మడి జిల్లా ఎస్పి కేబిఆర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మార్లవాయి గ్రామాన్ని సందర్శించి పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సరాఫరా అయిన జాతీయ జెండాను పద్మశ్రీ కనక రాజు చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖలో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని తీసుకుని ఇంటింటా జెండాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వన వమోత్సవంలో భాగంగా స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్నందున 75 సంఖ్యను 750 మొక్కలతో ఏర్పాటు చేయగా వాటిని పరిశీలించారు. ఇటీవల పోస్టల్ శాఖ పంగిడి బీపిఎం సయిద్ ఉస్మాన్ పదవీ విరమణ పొందగా శాలువ కప్పి , జాతీయ జెండా అందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనక ప్రతిభ దశరత్, బీపిఎంలు సయిద్ ఉస్మాన్, సంతోష్, గజగానంద్, నలేరావు, రాజేందర్, నారాయణ, తదితరులు ఉన్నారు.

## బీజేపి ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ

కాగజ్‌నగర్,ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్ ఏరియాలో భారతీయ జతనా పార్టీ కుమ్రం భీం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ బుధవారం పట్టణంలోని ప్రతీ షాపుకి తిరుగుతూ అజాదికా అమృత్ మహోత్సవం సందర్భంగా జాతీయ జెండాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం స్వతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు ప్రజలందరికి వాటి ఇంటి మీద 13,14,15వ తేదీలో జాతీయ జెండాలను ఆవిష్కరించాలని జాతీయ జెండాలు పంపిని చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొంగ సత్యనారాయణ, బీజేపి నాయకులు హరీష్‌బాబు, పట్టణ అధ్యక్షుడు గోలెం వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు మాచర్ల శ్రీనివాస్, గజ్జి ప్రసాద్ , భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు రవికాంత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి కార్తిక్, ఉపాధ్యాక్షులు చేరాల శ్రీనివాస్, బీసి మోర్చా పట్టణ అధ్యక్షుడు చిప్ప రమేష్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ముత్తు అశోక్, గడ్డం తిరుపతి, రవి, తదితరులు పాల్గొన్నారు.



## నేడు 2కే ఫ్రిడమ్ రన్

బెజ్జూర్,ప్రభాతవార్త

బెజ్జూర్ మండలంలోని ప్రజలు ఈ రోజు స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా 2కే రన్ కార్యక్రమంలో పాల్గొనాలని ఉదయం 7 గంటలకు మండల ఎంపిడిఓ కార్యాలయం నుండి రంగాపూర్ క్రాస్‌రోడ్డు వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కావున మండలంలోని యువతీ యువకులు ఈ ఫ్రీడమ్ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని బెజ్జూర్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా వన మహోత్సవం

కాగజ్‌నగర్‌రూరల్, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బీపివి యందు ఆజాదీకా అమృత్ మహోత్సవం 75వ స్వాతంత్ర్య దినోత్సవానిన పురస్కరించుకుని వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెకటర్ బి. రాజేశం పాల్గొని మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఎంపిపి చీపిరిశెట్టి శంకర్,ఎంపిడిఓ శ్రీనివాస్,ఎంపీఓ గౌరీ శంకర్, సీఐ నాగరాజు, ఎస్ఐ సోనియా, మండల కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌ఖాన్, చింతగూడ, కోయవాగు సర్పంచ్‌లు ఆత్రం సంజీవ్, చింతపూరి లక్ష్మి, కోయవాగు ఎంపిటిసి ఆస్మా నిచత్ బేగ్, ఏపిఎం ముక్తేశ్వర్,కోయవాగు కార్యదర్శి గీత, చింతగూడ మాజి ఎంపిటిసి నికూరె నాగేందర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఐకేపి సిబ్బంది, ఎంజిఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి కేసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



మంచిర్యాల,ప్రభాతవార్త

ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మంచిర్యాల పట్టణంతో పాటు మంచిర్యాల నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు వరద నీటిలో మునిగి స్థానికంగా నివాసం ఉండే ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. మంచిర్యాల నియోజకవర్గంలోని వరద నీటితో నష్టపోయిన ముంపు బాధితులను ఆదుకోవాలని వారికి ఆర్తిక సహాయం అందించాలని మరియు ముంపు ప్రాంతాల్లో కరకట్ట కట్టాలని కరకట్టకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వరద బాధితులను ఆదుకునేందుకు ప్రత్యక నిధులు కేటాయించాలని, మంచిర్యాల నియోజకవర్గంలో ప్రజలు వరదతో తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు నీట మునిగాయని తెలిపారు.

# పోరాటానికి అధ్యుడు కుమ్రం భీం..

*** జిల్లా జడ్పిచైర్ పర్సన్ కోవలక్ష్మి * జోడేఘాట్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటాం * జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

కెరమెరి,ప్రభాతవార్త

పోరాటానికి కుమ్రం భీం అధ్యుడని ,జల్,జంగిల్,జమీన్ కోసం నిజాం ప్రభుత్వంతో పోరాటం చేసిన గొప్ప వీరుడు భీం అని జిల్లా జడ్పి చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా కెరమెరి మండలం జోడెఘాట్ ప్రాంతంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంతో పోలిస్తే జోడెఘాట్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఆదివాసిల ఆరాధ్యదైవం కుమ్రం భీం నడయాడిన జోడెఘాట్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మ్యూజియం వద్ద కావల్సిన మరమ్మతులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మ్యూజియం చుట్టు హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యాటకులను ఆకర్శించే విధంగా చేయాలని సూచించారు. స్టేడియంలో మరమ్మతులు చేయడంతో పాటు చెడిపోయిన రహదారులు వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. జోడెఘాట్ అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. వజ్రోత్సవ వేడుకల్లో ప్రజలు భాగస్వాములయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పీఓ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పిటిసి దుర్పత బాయి, ఎంపిపి పోదూర్ మోతిరాం, వైస్ ఎంపిపి అబ్దుల్ కలాం, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, తహసీల్దార్ సమీర్ హైమద్‌ఖాన్, ఎంపిడిఓ సత్యనారాయణగౌడ్, వివిధశాఖ అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు .



# కుమ్రంభీం ఆసిఫాబాద్ వార్త





## 2కే రన్‌ను జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్,ప్రభాతవార్త

75 ఏళ్ల స్వాతంత్ర్య వజ్రోత్సవ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 11న ప్రతీ మండల కేంద్రంలో 2కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం 6.30 గంటలకు జిల్లా కేంద్రంలోని జైలు సమీపంలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహం నుండి భారత్ చెక్‌పోస్టు యూటర్న్ మీదుగా గాంధీ చౌక్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ఉద్యోగులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. అంతకు ముందు నూతన జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. జిల్లా కేంద్రంలోని స్పెషల్ సబ్‌జైల్ ఆవరణంలో 75 వసంతాల స్వాతంత్ర్య కార్యక్రమంలో 75 మొక్కలను సిబ్బందితో కలిసి జిల్లా అధికారులు మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించే బాధ్యత ప్రతీ తీసుకోవాలని సూచించారు.

దహెగాం,ప్రభాతవార్త

75 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకుంటున్న స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం రోజున 2కే రన్ నిర్వహించనున్నట్లు దహెగాం ఎస్‌ఐ సనత్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంలకు దహెగాం టవర్ వద్ద నుండి ఈ 2కే రన్ ప్రారంభమై మార్కెట్ ఏరియాలోని శివాజి విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. మండలంలోని ప్రజా ౖతినిధులు, యువతి యువకులు, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయంతం చేయాలని ఆయన కోరారు.

## దేశ స్వాతంత్ర్యంలో బీజేపి, ఆర్‌ఎస్‌ఎస్ పాత్రేమి లేదు

జైనూర్, ప్రభాతవార్త

దేశ స్వాతంత్ర్యంలో బీజేపి కాని ఆర్‌ఎస్‌ఎస్‌లది కానీ ఏమీ పాత్ర లేదని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇంచార్జి జాదవ్ గణేష్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అధిష్టాం ఆదేశాల మేరకు ఆజాదిక గౌరవ పాదయాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చి దేశానికి 75 సంవత్సరాలు పూర్తవుతున్న తరుణంలో ప్రతీ ఒక్కరు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా చేతిల్లో పట్టుకుని దేశ వీరులకు జోహార్లు అందిస్తు నినాదాలు చేసుకుంటు ర్యాలీ తీశారు. దేశ జెండాను గౌరవించని బీజేపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు దేశ స్వాతంత్ర్యంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్‌ను విమర్శిచడం విడ్డూరమన్నారు. బీజేపి అధికారంలో వచ్చినప్పటి నుండి సామాన్యుల మనుగడ కష్టతరంగా మారిందన్నారు. ఎన్నడూ లేని విధంగా డీజిల్, పెట్రోల్, నిత్యవసర సరుకుల ధరలు ఆశాకాన్నంటే విధంగా కేంద్ర పెంచి సామాన్యులకు తీరని నష్టాన్ని వాటిల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు వెంకటేష్, నాయకులు హమీద్‌ఖాన్, నరేష్, గణేష్, గణేష్ ఆడె, యూనుస్, ఆడె విలాస్, తదితరులు పాల్గొన్నారు.



# 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలు

కాగజ్‌నగర్,ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా క్రీడలను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ బుధవారం తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా ఈనెల 11,12వ తేదీల్లో పాఠశాల స్థాయిలో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, 100 మీ,200 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి. వేణుగోపాల్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 18వ తేదీన జరిగే మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు.

## జర్నలిస్టుల హక్కులను

# కాలరాస్తున్న ప్రభుత్వం

ఆసిఫాబాద్‌రూరల్,ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాలరాస్తుందని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహెమాన్ ఆరోపించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జర్నలిస్టుల బస్‌పాస్ పరిధి తగ్గింపు ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాలతో సాధించుకున్న జర్నలిస్టు హక్కులను ప్రభుత్వం కాలయారడం సిగ్గుచేటన్నారు. ఇటీవల నియోజకవర్గ జర్నలిస్టులకు ఉన్న స్టేట్ బస్‌పాస్ పరిధి నిలుపుదల ఉత్తర్వులను ఐఅండ్‌పీఆర్ శాఖ అధికారులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు స్టేట్ బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జర్నలిస్టుల కోసం కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టక పోగా ఉన్నవాటిని కుదిస్తు, రద్దుచేస్తు జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తుందని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అంతకు ముందు టీజేడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యాక్షుడు అబ్దుల్ జమీల్‌లు మాట్లాడుతూ బస్‌పాస్ పరిధి తగ్గింపు ఉత్తర్వులను వెంటనే ఉప సంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా అక్రిడిటేషన్ కమిటి సభ్యుడు ప్రకాష్‌గౌడ్, జర్నలిస్టులు సతీష్,హన్నన్, తారు,శ్రీనివాస్,సురేష్‌చారి,సాయిబాబా, మిలింద్,రాధాకృష్ణాచారి, నితీష్, ప్రశాంత్, రాజు,షఫిఉల్లాబేగ్, మీర్జా జలీల్, తదితరులు ఉన్నారు.




కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

# వజ్రోత్సవ స్ఫూర్తిని చాటిన ఎస్ఆర్ఆర్ కళాశాల

**- పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్**



**కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త:** ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో భారత వజ్రోత్సవ ద్విసప్తాహ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ సంయుక్త నేతృత్వంలో ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేకంగా త్రివర్ణ పతాకాలతో దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటేలా కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ జి.శ్యామ్ ప్రసాద్‌లాల్ హాజరై కలెక్టరేట్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలాలంకరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వజ్రోత్సవాలు పౌరులలో దేశం పట్ల ప్రేమను, గౌరవాన్ని పెంపొందిస్తాయన్నారు. వజ్రోత్సవాల స్ఫూర్తిని ప్రత్యేకంగా చాటిన ఎస్ఆర్ఆర్ కళాశాల బృందాన్ని అభినందించారు. జాతీయ సేవా పథకం, ఎన్‌సిసి ఆద్వర్యంలో కళాశాల ఆవరణలో చేపట్టిన 75 మొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమంలో అధ్యాపక బృందంతో కలిసి మొక్కలు నాటారు. ప్రజలు, విధ్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.హిమబిందు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వరప్రసాద్, నారాయణ, బి.సురేష్ కుమార్, నాయుడు, ఎన్‌సిసి లెఫ్టినెంట్ పి.రాజు, ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.




# గాంధీ సినిమాలు చూడండి

**- కరీంనగర్ సీపీ సత్యనారాయణ**

తిమ్మాపూర్, ప్రభాతవార్త: స్వాతంత్ర్యం ఎలా వచ్చిందో తెలుసుకోవలంటే గాంధీ సినిమాలో చూడాలని మోడల్ స్కూల్ విద్యార్థులకు కరీంనగర్ సీపీ సత్యనారాయణ సూచించారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో తిమ్మాపూర్ సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 75మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి కరీంనగర్ సీపీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా





హాజరై మొక్కలు నాటారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. స్వాతంత్ర్యం సాధించి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా మన స్వాతంత్ర్య పోరాటం గురించి తెల్సుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంతోమంది అమరుల త్యాగాల ఫలితమే స్వతంత్రమని పేర్కొన్నారు. అప్పట్లో ఎదిరించే వారిని కాల్చి చంపేవారిని అన్నారు. గాంధీ సినిమా చూడడం ద్వారా స్వాతంత్ర్య పోరాటం చాలవరకు అర్థం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీలు కరుణాకర్‌రావు, ప్రతాప్, ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాతంత్ర భారత వజ్రోత్సవాల వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- 16వ తేదీన నిర్వహించే సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమం విజయవంతం చేయాలి**

**- జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే**

**సిరిసిల్ల క్రైమ్, ప్రభాతవార్త :** స్వాతంత్ర భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 11న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఫ్రీడం రన్‌లో మరియు 16వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు, యువత, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ భావాన్ని చాటి చెప్పాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో 75వ స్వాతంత్ర వజ్రోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాల మీద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం రోజున జిల్లా వ్యాప్తంగా వేల మందితో 2కే ఫ్రీడం రన్ నిర్వహించాలని ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో పాఠశాల, కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు, కళాకారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 16వ తేదీన ఉదయం 11 గంటలకు గ్రామాలు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలోని అన్ని కూడల్లలో జాతీయ గీతాలాపన నిర్వహించనున్నారు. పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వవ, ప్రైవేటు పాఠశాల హెడ్ మాస్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాల సమన్వయంతో కార్యక్రమ నిర్వహణకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. జిల్లా యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు, ప్రతిఒక్క పౌరుడు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని పెంపొందించేలా మన జాతీయ గీతాలాపన ప్రపంచ దేశాలకు తెలిసే విధంగా భారతదేశం చరిత్రలో నిలిచేలా విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. భారత జాతీయ గీతాలాపన సమయంలో జిల్లాలో ఉన్న ప్రతిఒక్కరూ ఎక్కడికక్కడ నిలబడి జాతీయ గీతాలాపన చేయాలని, వేర్వేరు ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు కూడా తమ వాహనాలు ఆపివేస్తూ, అందులోని ప్రయాణీకులు కిందకు దిగి నిలబడి జాతీయ గీతం పాడాలని తెలిపారు. జాతీయ గీతాలాపన చేస్తున్న సమయంలో హారన్ కొట్టడం, మాట్లాడడం, కదలడం వంటి జాతీయ గీతాన్ని అవమానపరచడం అవుతుందని గుర్తించి నిశ్శబ్దంగా, క్రమశిక్షనతో ఉండాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్, రవికుమార్, సిఐ అనిల్ కుమార్, ఉపేందర్, సర్వర్, మొగిలి, వెంకటేష్, భన్సీలాల్, నవీన్‌కుమార్, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.




# కార్యాలయలపై జాతీయ జెండా ఎగురవేయాలి



**సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :** జిల్లాలోని రేషన్, పెట్రోల్‌బంక్‌లు, గ్యాస్ ఎజన్సీలు, రైస్ మిల్లులపై జాతీయ జెండాను ఎగురవేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో రేషన్ దుకాణారులు,పెట్రోల్ బంక్ యజమానులు మరియు రైస్ మిల్లర్ల ప్రతి నిధులతో సమావేశం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను ఈ నెల 8 నుండి 21వరకు నిర్వహించాలని తెలిపారు.ముఖ్యమంత్రి కెసిఆర్ అదేశాల పాటిస్తు జాతీయ జెండాను ఎగురవేయలి, మొక్కలు నాటుట,మండల స్థాయిలలో ఫ్రీడం రన్ నిర్వహించుట, రక్షా బంధన్, ర్యాలీలు నిర్వహించడం ,వినియోగదారుల హక్కులను తెలియాజేయటం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ నెల 15న సంబంధించిన స్థానములలో జాతీయ జెండా ఎగురవేయాలని అన్నారు.రాష్ట్ర సామూహిక జాతీయ గీతాలాపన చేయడం,రక్తదానం ,ఆటల పోటిలు నిర్వహించాలని అన్నారు.అసుపత్రులలో, వృద్దుల ఆశ్రమములలో పండ్లు ,మిఠాయిలు పంపిణి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్ హరికృష్ణ, డిప్యూటి తహసీల్దార్ కె నవీన్, సిహెచ్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచక్ర స్పేల్ స్కూల్ విద్యార్థికి బంగారు పతకం



**మెట్‌పల్లి - ప్రభాతవార్త :** ఇటీవల సుమంగళి గార్డెన్స్ మేడ్చల్ హైదరాబాద్‌లో కియో జపాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ ఆర్గనైజర్ సాయికుమార్ ఆధ్వర్యంలో, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో పట్టణానికి చెందిన శ్రీ చక్ర స్పేస్ స్కూల్‌లో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థి గోరుమంతుల శ్రీకేష్ బంగారు పథకం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి శ్రీకేష్‌ను కరస్పాండెంట్ సింగిరెడ్డి కవిత రాజేంధర్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, నాగరాజు, కృష్ణ, కిరణ్‌రాజు, నవాజ్, శ్రీను, భువనేశ్వర్, తదితరులుపాల్గొన్నారు.

# ఫ్రీడం రన్‌ను విజయవంతం చేయాలి

**- జిల్లా ఎస్పి సింధు శర్మ**

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** సాతంత్ర్య భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 11న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఫ్రీడం రన్ లో పౌరులు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ భావాన్ని చాటి చెప్పాలని జిల్లా ఎస్పి సింధు శర్మ పిలుపునిచ్చారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది.ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల మిని స్టేడియం నుండి ఉదయం 6:30 నిమిషాలకు ఫ్రీడం రన్ ప్రారంభం కావడం జరుగుతుంది. కావున ఇందులో పాఠశాల, కళాశాలల, విదా ్యర్థులు, క్రీడాకారులు, కళాకారులు, విద్యారు ్థులు, ప్రజలు ఉదయం 6:00 గంటల వరకు స్వచ్ఛందంగా మినీ స్టేడియం వద్దకు వచ్చి ఫ్రీడం రన్ లో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పి సింధూ శర్మ సూచించారు.